శనివారం
SATURDAY
10-10-2026
సంపుటి ( Volume):2 | సంచిక: (Issue): 102
జగిత్యాల JAGITIAL | పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385
www.evarthalu.com

# నేటి ఈవార్తలు
EVARTHALU
దినపత్రిక
ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

## శనివారం రాత్రి వరకు ఇంటర్నెట్ బంద్

- దేశ రాజధానిలో 57 మెట్రోస్టేషన్ల మూసివేత
- ఇతర రాష్ట్రాల రైళ్లు, బస్సులు దారి మళ్లింపు
- జంతర్‌మంతర్ వద్ద నిరసనకు సీజేపీకి నిరాకరణ
- మరో అనువైన స్థలాన్ని చూపించాలన్న సుప్రీం
- 22వేల మంది సాయుధ సిబ్బంది రాక
- మరో 10వేల మందికి పైగా పోలీసుల మోహరింపు



న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ అటు ఢిల్లీలో ఇటు దేశవ్యాప్తంగా ఆందోళనలు తారస్థాయికి చేరుకున్న నేపథ్యంలో.. దేశ రాజధానిలో పరిస్థితి.. బంద్‌ను తలపిస్తున్నది. శనివారం జంతర్ మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో తరువాయి 2 వ పేజీలో...



# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

## రాష్ట్రపతికి విపక్షాల ఫిర్యాదు.. పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ర్యాలీ

### 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని రాష్ట్రపతికి వినతిపత్రం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేశాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో 'ఇండియా' కూటమి ఎంపీలు, నాయకులు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం రాష్ట్రపతి తరువాయి 2 వ పేజీలో...



# నందిగ్రామ్‌లో బీజేపీ రికార్డు విజయం

### 1.22 లక్షల ఓట్ల భారీ మెజారిటీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీ చరిత్ర సృష్టించింది. ఆ పార్టీ అభ్యర్థి హసిరాణి రథ్ ఏకంగా 1,22,753 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 1967 నుంచి నందిగ్రామ్‌లో గెలిచిన అభ్యర్థుల మెజారిటీల్లో ఇదే అత్యధికం. ఈ ఫలితంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. హసిరాణి రథ్‌కు 1,64,427 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. సీపీఐ అభ్యర్థి శాంతి గోపాల్ గిరికి 5,779 తరువాయి 2 వ పేజీలో...

# సమగ్ర భూసర్వే

## 125 ఏళ్ల తర్వాత తొలిసారి.. భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

- ఏడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి
- 7 జోన్లకు 14 మంది అధికారుల నియామకం
- 15 రోజులకోసారి నేనే స్వయంగా సమీక్ష చేస్తా

**భూ సర్వే సమీక్షలో మంత్రి పొంగులేటి వెల్లడి**



తెలంగాణలో సమగ్ర భూ సర్వే చేపట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమైంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని పలు గ్రామాల్లో చేపట్టిన భూసర్వే ప్రక్రియను నవంబర్ లోపు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే సమగ్ర భూ సర్వేను ఏడాదిన్నర లోపు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): శుక్రవారం సమగ్ర రీ భూసర్వేపై శుక్రవారం సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూసర్వే పురోగతిపై మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వేకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ క్రమంలో భూ తరువాయి 2 వ పేజీలో...



# 817 సర్కారు భూమి తాకట్టు

## రేవంత్‌ది అనకొండ ఫ్యామిలీ

- భూముల విలువ తగ్గించి రుణాలు
- బీఆర్ఎస్ నేత క్రిశాంక్ సంచలన ఆరోపణలు
- తెలంగాణ సంపద కోసం పోరాడుతూనే ఉంటానని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం తెలంగాణలో అక్రమాస్తులు కూడగడుతూ 'అనకొండ ఫ్యామిలీ'గా మారిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సంచలన విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని ఇజ్జత్ నగర్, మోకిల, మియాపూర్, ఇంజాపూర్, చిలుకూరు, పటాన్‌చెరు, గాజులరామారం, జవహర్ నగర్ వంటి అత్యంత విలువైన ప్రాంతాల్లోని 817 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.12,818 కోట్లకు పైగా రుణాలు సమీకరించారని ఆయన ఆరోపించారు. ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానికి తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,071 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,196 |



# ఎల్‌నినోపై 12న రేవంత్ భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ తరువాయి 2 వ పేజీలో...

# శాంతి నోబెల్.. నవీ పిళ్లై

- భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లై
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటానికి గుర్తింపు
- రువాండా, అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా కీలక పాత్ర



జెనీవా: అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లైను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది. దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లై జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తరువాయి 2 వ పేజీలో...



# కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

- దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో రద్దీ
- 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాతరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మనిషి అగ్నిని పుట్టించిన సందర్భంలో తన తోటివారితో రాత్రి వేళల్లో మంటల చుట్టూ కూర్చోవడం వల్లే మాట్లాడే భాష పరిణామం చెంది ఉండవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. చీకటి పడిన తర్వాత సమూహాలుగా ఒకే చోట సురక్షితంగా గడపడానికి, అనుభవాలను పంచుకోవడానికి, వివరణాత్మకమైన కమ్యూనికేషన్ ద్వారా ఒకరికొకరు జ్ఞానాన్ని అందించుకోవడానికి అగ్ని ఒక సురక్షితమైన సామాజిక వాతావరణాన్ని సృష్టించిందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మంటల నుంచి వచ్చే మినుకుమినుకు వెలుగులో హావభావాలను అర్థం చేసుకోవడం కష్టం కాబట్టి, నోటి మాటల ప్రాధాన్యత పెరిగి ఉండవచ్చని తెలిపారు.

# డాక్టర్ల 'గొప్పలకు' చెక్!

- సోషల్ మీడియాలో ప్రచారానికి బ్రేక్
- రోగులు, సెలబ్రిటీలతో ప్రచారం కుదరదు
- నిరాధారమైన '100 శాతం నయం' వాదనలు నిషేధం
- నకిలీ ఫాలోవర్లు, రేటింగులు పెంచుకోవడం తప్పు

**జాతీయ వైద్య కమిషన్ కఠిన నిబంధనలు**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యులు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు చేపట్టే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలపై జాతీయ వైద్య కమిషన్ కఠిన నిబంధనలు విధించింది. వైద్య రంగంలో నైతిక విలువలను కాపాడటం, తప్పుదోవ పట్టించే ప్రకటనల నుంచి రోగులను రక్షించడం లక్ష్యంగా ఈ సమగ్ర మార్గదర్శకాలను అక్టోబర్ 6న జారీ చేసింది. ఈ నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటిం గ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా చేసే ప్రచారాలకు కూడా వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం, వైద్యులు లేదా ఆసుపత్రులు తమ సేవలను ప్రమోట్ చేసుకునేందుకు రోగుల టెస్టిమోనియల్స్ (అనుభవాలు), సెలబ్రిటీల సిఫార్సులు,తరువాయి 2 వ పేజీలో...




# పోయేదేం లేదు..

## 15వేల మందిని చేర్చుకుంటాం: టీసీఎస్

న్యూఢిల్లీ: గ్రీన్ కార్డు ప్రోగ్రాంపై అమెరికా సర్కారు తీసుకున్న నిర్ణయం వల్ల తమ పనిపై ఎటువంటి ప్రభావాన్ని చూపదు అని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పేర్కొన్నది. విదేశీ వర్కర్లకు గ్రీన్ కార్డులు జారీ చేసే అంశంలో.. 8 ఐటీ కంపెనీలపై అమెరికా నిషేధాన్ని విధించింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజాంట్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ఆ జాబితాలో ఉన్నాయి. అమెరికన్ జాబ్ మార్కెట్‌లో స్థానికులకు ఉద్యోగాలు రావడం లేదన్న ఉద్దేశంతో అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా నిర్ణయం పట్ల టీసీఎస్ స్పందిస్తూ.. తమ వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీలో కానీ, కస్టమర్ ఎంగేజ్మెంట్‌లో కానీ ఎటువంటి ప్రభావం ఉండబోదనితరువాయి 2 వ పేజీలో...



# సింగరేణి కార్మికులకు 15న పండుగ అడ్వాన్స్

రామగుండం, అక్టోబర్ 9 (ఈవార్తలు): సింగరేణి కార్మికులకు యాజమాన్యం దసరా కానుక ప్రకటించింది. అక్టోబర్ 15వ తేదీన పండుగ అడ్వాన్స్ జమ చేయనుంది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసింది. అర్హులైన రెగ్యులర్ ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు రూ. 25,000 పండుగ అడ్వాన్స్ జమ చేయనున్నారు. ట్రెయినీ ఉద్యోగులకు రూ. 12,500 చొప్పున అక్టోబర్ 15న బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.

## రాశి ఫలాలు

10.10.2026

మేషం: వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. ఉద్యోగాలలో అధికారులతో చిన్నపాటి వివాదాలుంటాయి.

వృషభం: దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విశేషాలు తెలుస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందుతారు.

మిధునం: చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

కర్కాటకం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి. దైవచింతన కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు.

సింహం: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

కన్య: ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. సన్నిహితులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

తుల: పాత మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఋణయత్నాలు వేగవంతం చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులుంటాయి.

వృశ్చికం: సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు.

ధనస్సు: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేయాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఋణగ్రస్తుల నుండి రావలసిన సొమ్ము వసూలవుతుంది. నూతన వస్తులాభాలు పొందుతారు. నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పురోగతి కలుగుతుంది.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.

మీనం: చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటా బయట గందరగోళ పరిస్థితులుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు.

# సమగ్ర భూసర్వే



వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, సర్వేలో వేగం పెంచుతామన్నారు. అధికార యంత్రాంగం కూడా అత్యంత బాధ్యతతో తమ విధులు నిర్వర్తించాలన్నారు. భూసర్వేను నిరంతరం పర్యవేక్షించేందుకు ఏడు జోన్లకు రెవెన్యూ, సర్వే డిపార్ట్‌మెంట్ల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించామన్నారు. సర్వే విషయంలో ప్రజల స్పందనను పరిగణనలోకి తీసుకుని అందుకనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సర్వే తొలి దశలో భాగంగా నక్షా లేని 365 గ్రామాల్లో.. అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున రీసర్వే ముమ్మరంగా సాగుతుందన్నారు. ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీసర్వే జరగాలని మంత్రి స్పష్టం చేశారు. రీసర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రీసర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు

రీసర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.

ఎర్రవల్లిలో సర్వే కోసం మరోసారి నోటీసులు

శుక్రవారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని, సర్వే కోసం మరోసారి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు చేతులు మారాయి. వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమరవీరులను గుర్తించి వాళ్లకు న్యాయం చేస్తామన్నారు. ఎర్రవల్లిలో కూడా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామన్నారు.

(బాక్స్)

జీవో 59 దరఖాస్తుదారులకు శుభవార్త

ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటుచేసుకుని.. ఆ స్థలాల క్రమబద్ధీకరణకు జీవో59 కింద దరఖాస్తు చేసుకున్నవారికి సర్కార్ శుభవార్త వినిపించింది. రెండేళ్లుగా ఎదురుచూస్తున్న బాధితుల ముఖాల్లో ఆనందం నింపింది. జీవో 59 కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం కానుంది. దీంతో 500 చదరపు గజాల లోపు ఉన్న స్థలాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఈమేరకు కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జీవో 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావు లేదు.. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పారు. గతంలో జీవో 59 అమలులో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.

# శాంతి నోబెల్.. నవీ పిళ్లై

మొదటి పేజీ తరువాయి

తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.

పిళ్లైని విమర్శిస్తూ పోస్ట్ రీషేర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిని ఆశించి మరోసారి భంగపడ్డారు. తాను ఆశించిన 2026 నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా మానవ హక్కుల న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైతో పాటు, అవార్డును ప్రకటించిన నార్వేజియన్ నోబెల్ కమిటీని విమర్శిస్తూ చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో రీషేర్ చేశారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ మేరకు స్పందించారు. తన మాజీ న్యాయవాది డేవిడ్ షోయెన్ చేసిన ఒక పోస్టును ఆయన పంచుకున్నారు. "ఐక్యరాజ్యసమితికి చెందిన నవీ పిళ్లైకు ఈ పురస్కారాన్ని అందజేయడం ద్వారా నోబెల్ కమిటీ కోలుకోలేని విధంగా అవమానానికి గురైంది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి విలువను ఇది తగ్గించింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నవీ పిళ్లై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను తీవ్రంగా ద్వేషిస్తారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హమాస్‌కు అండగా నిలిచారని అందులో ఆరోపించారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఆమె నేతృత్వంలోని ఐరాస కమిషన్ నివేదించడాన్ని ఒక "ప్రహసనం"గా అభివర్ణించారు. అదే సమయంలో, అబ్రహాం ఒప్పందాలు, బందీల విడుదల, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు ట్రంప్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకే నోబెల్ దక్కాలని ఆ పోస్టులో పేర్కొన్నారు.

# పోయేదేం లేదు..

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నది. తాము లోకల్ హైరింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు టీసీఎస్ చెప్పింది. గడిచిన రెండేళ్ల నుంచి తమ పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ దరఖాస్తుల సంఖ్య సింగిల్ డిజిట్‌లోనే ఉందని, గ్రీన్ కార్డులను సస్పెండ్ చేయడం వల్ల తమ వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీలో మార్పు ఉండబోదని టీసీఎస్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. అమెరికా కార్మిక శాఖ ఇచ్చే ఆదేశాలకు అనుగుణం వ్యవహరించనున్నట్లు టీసీఎస్ తెలిపింది. గ్రీన్ కార్డుల పరిస్థితి ఎలా ఉన్నా.. తమ కంపెనీ మాత్రం అమెరికాలో సుమారు 15వేల మందిని రానున్న అయిదేళ్లలో రిక్రూట్ చేసుకోనున్నట్లు టీసీఎస్ పేర్కొన్నది.

### అధికులు అమెరికన్లే: మైక్రోసాఫ్ట్

మైక్రోసాఫ్ట్ సైతం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో తాము దాఖలు చేసిన సుమారు 6,000 హెచ్-1బీ దరఖాస్తుల్లో దాదాపు 80 శాతం దరఖాస్తులు, ఇప్పటికే సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల వీసా పొడిగింపు లేదా వారి హోదా (స్టేటస్) మార్పునకు సంబంధించినవేనని వివరించింది. ఇవి కొత్త నియామకాలు కావని స్పష్టం చేసింది. మిగిలిన దరఖాస్తులు సైతం అమెరికాలో ఇప్పటికే చట్టబద్ధంగా నివసిస్తూ తమ సంస్థలో చేరిన వారికి సంబంధించినవని, వీరు తమ మొత్తం అమెరికా సిబ్బందిలో కేవలం ఒక శాతం మాత్రమేనని పేర్కొంది. హెచ్-1బీ ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం అందిస్తున్నామని, టెక్ రంగంలోనే అత్యధిక వేతనాలు చెల్లిస్తున్న సంస్థల్లో తమది ఒకటని ఈ సందర్భంగా వెల్లడించింది.

# డాక్టర్ల 'గొప్పలకు' చెక్!

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ప్రచారాలు, చివరికి తమ ఉద్యోగుల అభిప్రాయాలను కూడా ఉపయోగించకూడదు. ప్రచార ఉద్దేశంతో రోగుల నుంచి ప్రత్యేకంగా రివ్యూలు సేకరించడంపై కూడా నిషేధం విధించారు. "నెం.1 స్పెషలిస్ట్", "బెస్ట్ డాక్టర్", "ప్రముఖ నిపుణులు" వంటి బిరుదులను ప్రకటనల్లో వాడాలంటే, అందుకు కచ్చితమైన, నిరూపించగల ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. అదేవిధంగా, "100% సక్సెస్", "గ్యారెంటీ క్యూర్", "అద్భుత చికిత్స", "నొప్పి లేని వైద్యం" వంటి వాగ్దానాలను సరైన శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రచారం చేయకూడదని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారాలపై కూడా జాతీయ వైద్య కమిషన్ ప్రత్యేక ఆంక్షలు విధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించిన నకిలీ రోగుల టెస్టిమోనియల్స్, తప్పుడు చికిత్సా ఫలితాలు, మోసపూరిత ప్రచార మెటీరియల్‌ను వాడటాన్ని నిషేధించింది. అయితే, ఆరోగ్య సంరక్షణ సమాచార వ్యాప్తిలో ఏఐ వాడకంపై ఇది పూర్తి నిషేధం కాదని పేర్కొంది. సోషల్ మీడియాలో ఫేక్ ఫాలోవర్లు, లైకులు, కామెంట్లు, రివ్యూలు కొనుగోలు చేయడం, సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగ్స్‌ను తారుమారు చేసి తప్పుడు అభిప్రాయం కలిగించడం వంటి చర్యలను కూడా నియంత్రించింది. చికిత్సకు ముందు, తర్వాత తీసిన ఫోటోలు, సర్జరీ ఫలితాలు, వ్యక్తిగత రోగుల విజయగాథలను ప్రచారానికి వాడుకోరాదని తేల్చిచెప్పింది. శాస్త్రీయంగా నిరూపణ కాని చికిత్సలు, రహస్య నివారణ పద్ధతులు, భద్రత, సమర్థతపై సరైన ఆధారాలు లేని వైద్య విధానాలను ప్రచారం చేయడాన్ని కూడా నిషేధించారు. రోగులలో భయాన్ని సృష్టించి, అనవసరమైన డయాగ్నస్టిక్ పరీక్షలు లేదా చికిత్సలు చేయించుకునేలా ప్రేరేపించే ప్రకటనలపై ఆంక్షలు విధించారు.

## నందిగ్రామ్‌లో బీజేపీ రికార్డు విజయం

మొదటి పేజీ తరువాయి

ఓట్లు వచ్చాయి. ఆలిండియా సెక్యులర్ ఫ్రంట్ అభ్యర్థి అలీ మహమ్మద్ సబీర్ మీరాజ్ ఖాన్ 1,607 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్‌కు కేవలం 853 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉంది. ఆ పార్టీ అభ్యర్థి సంచిత ప్రధాన్ డే చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మమతా బెనర్జీ ప్రకటించారు. అయినప్పటికీ బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. నందిగ్రామ్‌లో గతంలో అత్యధిక మెజారిటీ రికార్డు ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి పేరిట ఉండేది. 2016లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 81,230 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి బీజేపీ అభ్యర్థి అంతకంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తారని తాను ముందే అంచనా వేసినట్లు సువేందు అధికారి తెలిపారు.

## ఎల్‌నినోపై 12న రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

## 817 సర్కారు భూమి తాకట్టు

మొదటి పేజీ తరువాయి

రూ.150 కోట్లకు పైగా ఉండగా, కేవలం రూ.15 కోట్లుగా చూపించి రుణాలు పొందారని విమర్శించారు. తాకట్టు పెట్టిన భూమిలో కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఎలా కంటైనర్లను ఏర్పాటు చేసిందని ఆయన ప్రశ్నించారు. తాను అక్రమాస్తులపై ప్రశ్నిస్తుంటే నిజం బయటపడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి, ఆయన బృందం స్పందించడం లేదని క్రిశాంక్ అన్నారు. తాను వ్యక్తిగత ఆస్తుల గురించి కాకుండా, తెలంగాణ సంపద గురించే ప్రశ్నిస్తున్నానని, ఎన్ని బెదిరింపులు వచ్చినా రాష్ట్ర వనరుల పరిరక్షణకు పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## ఢిల్లీ అష్టదిగ్బంధనం

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ క్రమంలో నిరసన తెలిపే ఏ ప్రయత్నాన్నైనా చట్టవిరుద్ధమేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అలాగే, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మెట్రో స్టేషన్లు మూతపడనున్నాయి. అలాగే, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు, బస్సుల సేవల నిలిచిపోనున్నాయి. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి 11వ తేదీ తెల్లవారుజామువరకు ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను మూసివేయనున్నారు. దీంతో సెంట్రల్ ఢిల్లీలో రాకపోకలకు అంతరాయం కలగనుంది. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు చేరుకోవాల్సిన మెయిల్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను అక్టోబర్ 10 మధ్యాహ్నం 2 గంటల నుంచి 11వ తేదీ తెల్లవారుజాము వరకు నిలిపివేయనున్నారు. సెంట్రల్ ఢిల్లీకి వెళ్లే బస్సుల రాకపోకలను కూడా రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిలిచిపోనున్నాయి.

## కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

మొదటి పేజీ తరువాయి

సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీనితో పాటు, వివాదాస్పదంగా మారిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, ముసాయిదా జాబితాల నుంచి అన్యాయంగా తొలగించిన 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని వారు రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు 16 పార్టీలకు చెందిన నేతలు సంతకాలు చేసిన మెమొరాండంను ఆమెకు అందజేశారు. ర్యాలీ సందర్భంగా విపక్ష నేతలు కర్తవ్య పథ్‌పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 'ఓట్ చోరీ' జరిగిందని, ఈసీ-బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. "జ్ఞానేశ్, ఇట్స్ డన్ బ్రో!" వంటి ప్లకార్డులను ప్రదర్శించారు.

# చిత్రపురి అక్రమాలపై సీబీఐ విచారణ!

## టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్.. మంత్రి తుమ్మల వెంటనే స్పందించాలని వినతి



హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): చిత్రపురి కాలనీలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మిగిలిన నాలుగు ఎకరాల భూమిని కాపాడితే 600 మంది పేద సినీ కార్మికులకు ఇళ్లు ఇవ్వొచ్చన్నారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విచారణకు ఆదేశించాలని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెంటనే స్పందించాలని కోరారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో చిత్రపురి కాలనీ సాధన సమితి నాయకులు కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రూ.19 కోట్ల రుణం.. 24 శాతం వడ్డీ

చిత్ర పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ కార్మికులు ఎంతో కష్టపడి పనిచేస్తేనే నటీనటులకు గుర్తింపు వస్తుందని, అలాంటి కార్మికులకే సొంతిల్లు కట్టుకోవడం కష్టంగా మారిందని కవిత అన్నారు. సినీ కార్మికులకు ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి 67 ఎకరాల భూమిని గజానికి రూ.40 చొప్పున కేటాయించారని గుర్తుచేశారు. ఈ స్థలంలో 4,200 మందికి ఇళ్లు కేటాయించాల్సి ఉండగా, 2015 వరకు కూడా అలాట్మెంట్ జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015-2023 మధ్య చిత్రపురి సొసైటీలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. అప్పటి మంత్రుల అండతో అనిల్ అనే వ్యక్తి సొసైటీ, ఫిల్మ్ ఫెడరేషన్‌ను తన ఆధీనంలోకి తీసుకున్నారని విమర్శించారు. సుమారు 300 కేసులు నమోదైనప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదన్నారు. కోర్టు, సహకార సంస్థ నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఒక్కో ఇళ్ల సముదాయాన్ని బట్టి రూ.23 కోట్లు, రూ.10 కోట్లు వసూలు చేశారని కవిత పేర్కొన్నారు. 67 ఎకరాల్లో మిగిలిన నాలుగు ఎకరాలను తనఖా పెట్టి, ఏడాదికి 24 శాతం వడ్డీతో రూ.19 కోట్ల రుణం తీసుకున్నారని ఆరోపించారు. సహకార సంఘ నిబంధనల ప్రకారం ఇలా తనఖా పెట్టడం కుదరదన్నారు. ఇప్పుడు అదే స్థలంలో ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు బహిరంగంగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.

### కాంగ్రెస్ హామీ ఏమైంది?

చిత్రపురి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కవిత గుర్తుచేశారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా సినీ కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. కార్మికుల రక్తం, చెమటతో కొనుక్కున్న ఇళ్లను ఇతరుల చేతుల్లోకి వెళ్లనివ్వకూడదని స్పష్టం చేశారు. అలాట్మెంట్ కమిటీలో కలెక్టర్‌తో పాటు సినీ ప్రముఖులు, సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ సతీమణి, సుద్దాల అశోక్‌తేజ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. పీవీ శ్రీనివాస్ సతీమణికి సొసైటీలో ఇల్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఆమె ఎప్పటి నుంచి సభ్యురాలిగా ఉన్నారో వెల్లడించాలని, కమిటీలో ఉన్నవారికే ఇళ్లు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. సుద్దాల అశోక్‌తేజ అక్కడ జరుగుతున్న అవినీతిపై బయటకు వచ్చి మాట్లాడాలని కోరారు. ఆమెకు కేటాయించిన ఇంటిని రద్దు చేస్తారా? లేక కమిటీ నుంచి తొలగిస్తారా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ కో-డైరెక్టర్ తోట రామకృష్ణకు కేటాయించిన ఇంటిని ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన అనిల్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నా పోలీసులు ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఫెడరేషన్‌లోని యూనియన్లలో తన అనుచరులను పెట్టుకుని కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.

### సినీ పెద్దలు జోక్యం చేసుకోవాలి

చిత్రపురి కాలనీ వ్యవహారంలో చిరంజీవి, పవన్‌కల్యాణ్, సురేశ్‌బాబు, దిల్‌రాజు వంటి సినీ ప్రముఖులు జోక్యం చేసుకోవాలని కవిత కోరారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా సీఎం సమావేశం కోసం సొసైటీ సభ్యుల నుంచి అనిల్ ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. మళ్లీ సీఎం నిర్వహించనున్న సమావేశం కోసం కూడా రూ.2 లక్షలు ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. సీఎం సమావేశం పెట్టి రూ.10 కోట్లు ఇప్పిస్తానని చెబుతున్నారని, ఆ డబ్బును అనిల్‌కు ఇస్తే కార్మికులకు న్యాయం జరగదని అన్నారు. దిల్‌రాజు వంటి ప్రముఖుల ద్వారా ఫిల్మ్ ఫెడరేషన్‌కు నిధులు అందించాలని సూచించారు. వసూలు చేసిన రూ.2 లక్షలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీలోని భూమి విలువ ప్రస్తుతం రూ.7 వేల కోట్లుగా ఉందని పేర్కొన్న కవిత.. ఇంత విలువైన ఆస్తిలో అక్రమాలు జరుగుతున్నా బాధ్యులకు శిక్ష పడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అనిల్‌పై ఈడీ, సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. సినీ కార్మికులు ఆందోళన చెందవద్దని, రెండేళ్లలో తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కవిత అన్నారు. కార్మికులకు అండగా ఉంటామని, అవసరమైతే వారితో కలిసి వీధి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. ఫిల్మ్ ఫెడరేషన్ నుంచి అనిల్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

## 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్ ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు.

### ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది: హరీశ్ రావు

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

## నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు

నోయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు.

## హైదరాబాద్ మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ 'ఫ్లయింగ్ ఫ్లీ'

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎలక్ట్రిక్ వాహన రంగంలోకి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. తన ప్రత్యేక ఎలక్ట్రిక్ మొబిలిటీ బ్రాండ్ 'ఫ్లయింగ్ ఫ్లీ' నుంచి అత్యాధునిక 'జ6' మోడల్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను హైదరాబాద్ మార్కెట్లో అధికారికంగా విడుదల చేసింది. బెంగళూరు తర్వాత ఈ బైక్ అందుబాటులోకి వచ్చిన రెండో భారతీయ నగరంగా హైదరాబాద్ నిలిచింది. 2026 అక్టోబర్ 9 నుంచి నగరంలో దీని అమ్మకాలు, సర్వీస్ కార్యకలాపాలు అందుబాటులో ఉంటాయి. నగరంలోని వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు కంపెనీ 'హబ్-అండ్-స్పోక్' మోడల్‌ను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా ఎర్రగడ్డ మెయిన్ రోడ్‌లో కంపెనీ తన సొంత ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రత్యేకమైన సాంకేతిక సేవలు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు వనస్థలిపురంలోని టారస్ మోటార్స్, హైటెక్ సిటీలోని బోల్ట్ మోటార్‌సైకిల్స్ ఎల్ఎల్‌పి, కొండాపూర్‌లోని ఎస్‌వీఆర్ మోటార్స్ అనే మూడు భాగస్వామ్య అవుట్‌లెట్ల ద్వారా సాధారణ సర్వీసింగ్, నిర్వహణ సేవలను అందిస్తోంది. అంతేకాకుండా, ప్రతి బైక్‌తో పాటు 24/7 రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## మా దేశ విధానాలను శాసించొద్దు

**ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ కౌంటర్**

చెన్నై: ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎమ్) పార్టీ అధినేత కమల్ హాసన్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ను ఉద్దేశిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ విధానాలను ఏ బిలియనీర్, అది భారతీయుడైనా, అమెరికన్ అయినా నిర్దేశించలేరని ఆయన తన ట్వీట్‌లో ఘాటుగా స్పందించారు. శాటిలైట్ ఇంటర్నెట్, అంతర్జాతీయ వాణిజ్య విధానాలపై పాశ్చాత్య దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఆయన సూటిగా ప్రశ్నించారు. "మిస్టర్ మస్క్, ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ఏ బిలియనీర్ కూడా, అది భారతీయమైనా, అమెరికన్ అయినా, ఒక దేశ విధానాలను శాసించకూడదు. శాటిలైట్ ఇంటర్నెట్ రంగంలో పోటీని మేం మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం. అది భారతీయ కంపెనీ అయినా, గ్లోబల్ సంస్థ అయినా సరే. కానీ, మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు కూడా అందుబాటులో ఉండేలా, ఆచరణాత్మకమైన, చవకైన సేవలు అందించాలి. అధిక సబ్‌స్క్రిప్షన్ ఫీజులు, పరికరాల ఖర్చులతో సాధారణ కుటుంబాలకు ఈ సేవలు అందని ద్రాక్షలా మారకూడదు.

# చిట్టచివరి వ్యక్తి కోసం 'డిజి' తపాలా!

**నెలకు 20 లక్షల మందికి చేయూత పింఛన్ల పంపిణీ**

**263 ఆధార్ కేంద్రాల ద్వారా పౌర సేవలు**

**రోజ్‌గార్ మేళాల్లో 1,86,202 మందికి నియామక పత్రాలు**

**తెలంగాణ తపాలా సర్కిల్ ముఖ్య అధికారి డీఎస్‌వీఆర్ మూర్తి**



హైదరాబాద్, అక్టోబర్ 9 (పీఐబీ): తెలంగాణలో డిజిటల్ సేవలను విస్తరిస్తూ, గ్రామీణ, పట్టణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు తపాలా సేవలను చేరువ చేస్తున్నట్లు తెలంగాణ తపాలా సర్కిల్ ముఖ్య తపాలా అధికారి డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. ఆధార్, పాస్‌పోర్టు, బ్యాంకింగ్, బీమా, పింఛన్ల పంపిణీతో పాటు వేగవంతమైన తపాలా సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న జాతీయ తపాలా వారోత్సవాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ సాధించిన పురోగతి, సాంకేతిక మార్పులు, ఆర్థిక సేవల విస్తరణ, ఉపాధి కల్పనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

### దేశవ్యాప్తంగా 1,64,999 తపాలా కార్యాలయాలు

"ఒకే తపాలా వ్యవస్థ.. అపరిమిత అవకాశాలు" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మూర్తి తెలిపారు. దేశవ్యాప్తంగా 1,64,999 తపాలా కార్యాలయాలతో భారత తపాలా శాఖ ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థగా కొనసాగుతోందని చెప్పారు. వీటిలో 1,49,385 కార్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని వివరించారు. తెలంగాణ తపాలా సర్కిల్ పరిధిలో 36 ప్రధాన తపాలా కార్యాలయాలు, 759 ఉప తపాలా కార్యాలయాలు, 5,424 శాఖా తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థలో 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.

### 1,272 మందికి ఉద్యోగ నియామకాలు

17 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా తపాలా శాఖ దేశవ్యాప్తంగా 1,86,202 నియామక ఉత్తర్వులు జారీ చేసిందని మూర్తి తెలిపారు. వీరిలో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని చెప్పారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272 మంది ఉద్యోగ నియామకాలు పొందారని వెల్లడించారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా యూనివర్సల్ పోస్టల్ యూనియన్ నిర్వహించిన అంతర్జాతీయ లేఖా రచన పోటీ-2026లో తెలంగాణ సర్కిల్ తరఫున విజేతలుగా నిలిచిన వారికి మూర్తి బహుమతులు అందజేశారు. తపాలా శాఖ సేవలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### డిజిటల్ సాంకేతికతతో మెరుగైన సేవలు

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఏపీటీ 2.0 వేదిక తపాలా సేవల ఆధునికీకరణలో కీలకమని మూర్తి పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం సహకారంతో అభివృద్ధి చేసిన డిజిపిన్ ద్వారా 10 అక్షరాలతో కూడిన భౌగోళిక ఆధారిత డిజిటల్ చిరునామా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. డోర్‌స్టెప్ సర్వీస్ (డీఎస్ఎస్) అనువర్తనం ద్వారా వస్తువుల బట్వాడాను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో 2026 మార్చి 17న ప్రారంభించిన 24 గంటలు, 48 గంటల స్పీడ్ పోస్ట్ సేవల ద్వారా 1.33 లక్షలకు పైగా వస్తువులు నమోదయ్యాయని వెల్లడించారు. 94 పిన్‌కోడ్ ప్రాంతాల్లో నిర్ణీత సమయంలో వస్తువులను చేరవేస్తున్నట్లు చెప్పారు. తపాలా కార్యాలయాల కౌంటర్లలో యూపీఐ, కార్డు చెల్లింపుల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వస్తువు అందినప్పుడు నగదు చెల్లించే విధానంలోనూ సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

### పాస్‌పోర్టు, ఆధార్ సేవల్లో పురోగతి

తెలంగాణలోని 14 తపాలా పాస్‌పోర్టు సేవా కేంద్రాల ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,66,478 లావాదేవీలు జరిగాయని మూర్తి తెలిపారు. 2026 సెప్టెంబర్ వరకు మరో 87,100 లావాదేవీలు నమోదైనట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 263 ఆధార్ కేంద్రాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4,75,592 లావాదేవీలు జరగ్గా, 2026 సెప్టెంబర్ వరకు మరో 3,17,146 లావాదేవీలు నమోదయ్యాయని వెల్లడించారు. తపాలా శాఖ ద్వారా ప్రతి నెలా సుమారు 20 లక్షల మంది చేయూత పింఛను లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నెలకు దాదాపు రూ.500 కోట్లు పంపిణీ అవుతున్నాయని వివరించారు. స్వయం సహాయక సంఘాల రుణ చెల్లింపుల సేకరణలో స్త్రీనిధికి కూడా తపాలా శాఖ సహకరిస్తోందని పేర్కొన్నారు. 'హోలీ బ్లెస్సింగ్' కార్యక్రమం ద్వారా భక్తులకు ప్రసాద పార్శిళ్లను వారి ఇళ్ల వద్దకే చేరవేస్తున్నట్లు తెలిపారు.

### 1.07 కోట్ల పొదుపు ఖాతాలు

2026 మార్చి 31 నాటికి తెలంగాణ తపాలా సర్కిల్ పరిధిలో 1.07 కోట్ల క్రియాశీల తపాలా పొదుపు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని మూర్తి వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి గ్రామీణ జనాభాలో 25 శాతం మందిని ఆర్థిక సేవల పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో కనీసం 10 శాతం పొదుపు ఖాతాలను డిజిటల్ లావాదేవీలకు అనుసంధానించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల సౌలభ్యం కోసం అంతర్జాల బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

### బీమా ప్రీమియంగా రూ.590.13 కోట్లు

తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) పథకాల ద్వారా పౌరులకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు మూర్తి తెలిపారు. తపాలా జీవిత బీమా పరిధిని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు నిపుణులు, పట్టభద్రులకు విస్తరించామని, గ్రామీణ తపాలా జీవిత బీమాను పట్టణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ సర్కిల్ పరిధిలో 71,233 కొత్త పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పాలసీలు విక్రయించి, వాటి ద్వారా రూ.590.13 కోట్ల ప్రీమియం వసూలు చేసినట్లు వెల్లడించారు. అదే ఆర్థిక సంవత్సరంలో రూ.661.88 కోట్ల ఆదాయ లక్ష్యానికి గాను రూ.596.71 కోట్ల ఆదాయం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2026 సెప్టెంబర్ నాటికి రూ.322.28 కోట్ల ఆదాయం నమోదైనట్లు మూర్తి వివరించారు.

# త్వరలో జగిత్యాల మెడికల్ కాలేజీ ప్రారంభం

**సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తాం**

**ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెల్లడి**



జగిత్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల అభివృద్ధిని అడ్డుకునేందుకే మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ఆరోపించారు. త్వరలో జగిత్యాల వైద్య కళాశాల పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల బకాయిలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్రం జీఎస్టీ పెంచడం వల్ల నిర్మాణ పనులపై అదనంగా రూ.8 కోట్ల భారం పడిందన్నారు. వైద్య విద్యార్థుల నిరసన నేపథ్యంలో కలెక్టర్‌తో కలిసి కళాశాలకు వెళ్లి వారితో మాట్లాడినట్లు చెప్పారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, అవసరమైతే సభ్యత్వం తీసుకుంటానని పేర్కొన్నారు. నూకపల్లి పట్టణ గృహ నిర్మాణ కాలనీ భూసేకరణపై జీవన్‌రెడ్డి చేస్తున్న విమర్శలను సంజయ్‌కుమార్ తప్పుబట్టారు. రహదారి సదుపాయం, అవసరమైన పత్రాలు లేకుండానే గతంలో భూమిపూజ చేయడంతో ఆ స్థలం నిరుపయోగంగా మారిందని ఆరోపించారు. మాజీ ఎంపీ కవిత సహకారంతో రెండు పడక గదుల ఇళ్లకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. రోల్లవాగు ప్రాజెక్టు అటవీ అనుమతుల కారణంగా ఆలస్యమవుతోందని వివరించారు. ముంపునకు గురయ్యే 827 ఎకరాల అటవీ భూమికి బదులుగా రెవెన్యూ భూమి కేటాయించే ప్రక్రియతో అనుమతుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

పట్టణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాల సముదాయం పనులు కొనసాగుతున్నాయని, నాలుగు వైపులా ద్వంద్వ రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. కూరగాయలు, మాంసాహార మార్కెట్‌ను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, పీసీసీ నాయకుడు బండ శంకర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుమల రాజ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు

బీర్పూర్, అక్టోబర్ 9 (ఈవార్తలు): జిల్లా విద్యాశాఖాధికారి రాము శుక్రవారం బీర్పూర్ మండలంలోని ఎంపీపీఎస్ జీపీ బీర్పూర్, ఎంపీపీఎస్ ఇంద్రనగర్ కాలనీ, జెడ్పీహెచ్‌ఎస్ నర్సింహులపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాలలకు చేరుకున్న డీఈఓకు విద్యార్థినులు బతుకమ్మలు, పూల అలంకరణలతో స్వాగతం పలికారు. వారి సాంస్కృతిక ప్రతిభను ఆయన అభినందించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానానికి సంబంధించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలని, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగభూషణం, ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు ఉన్నారు.



## రోడ్డుమీదికొచ్చిన చెట్లు

కొడిమ్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): చెప్యాల ఎక్స్‌రోడ్డు నుంచి దొంగలమర్రి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు, గడ్డి అడ్డంగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో నిత్యం భక్తులు, ఇతర ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

## జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ప్రసునాంబ

**నిజామాబాద్‌కు బి. రాజగౌడ్ బదిలీ**

జగిత్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ రెవెన్యూ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ (సర్వీసెస్-1) శాఖ అక్టోబర్ 9 (ఈవార్తలు), 2026న జీఓ ఆర్టీ నంబర్ 630ను విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, జగిత్యాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేస్తున్న బి. రాజగౌడ్‌ను నిజామాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎన్ ప్రసునాంబను జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించారు. డి. వెంకట మాధవరావును నిర్మల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా, పి. రామ్‌రెడ్డిని వనపర్తి జిల్లా రెవెన్యూ అధికారిగా, యాదగిరిని మహబూబ్‌నగర్ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ)గా, మోహన్‌సింగ్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ)గా నియమించారు. పి. పద్మప్రియ సేవలను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు ఏడాది పాటు ప్రతినియుక్తిపై వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చి. కృష్ణయ్యను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక ఉప కలెక్టర్ (యూఎల్‌సీ)గా, జి. కుమారస్వామిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ)గా నియమించారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.లక్కీ డ్రాలో ఎలక్ట్రిక్ బైక్



## లక్కీడ్రాలో ఎలక్ట్రిక్ బైక్

**2,000 కూపన్లలో విజేతగా రాజారాం గ్రామానికి చెందిన లక్ష్మి**

జగిత్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాజారాం గ్రామంలోని అల్ అమాన్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ప్రదర్శనశాల ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో అదే గ్రామానికి చెందిన జి. లక్ష్మి విజేతగా నిలిచారు. ఆమెకు రూ.35 వేల విలువైన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ప్రారంభోత్సవానికి వచ్చిన వినియోగదారులకు నిర్వాహకులు లక్కీ డ్రా కూపన్లు పంపిణీ చేశారు. మొత్తం 2,000 మంది ఈ డ్రాలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గ్రామ సర్పంచ్ విజయ్, ఉపసర్పంచ్ శీను, న్యాయవాది భూమి రమణ, ప్రదర్శనశాల యజమాని హౌస్ పాషా ఆధ్వర్యంలో చిన్నారి చేతుల మీదుగా డ్రా తీశారు. లక్ష్మి పేరు ఎంపిక కావడంతో యజమాని హౌస్ పాషా ఆమెకు వాహనాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సుద్దాలలో కాన్షీరాంకు నివాళులు



కోనరావుపేట, అక్టోబర్ 9 (ఈవార్తలు): బహుజనుల రాజకీయ సాధికారత కోసం జీవితాంతం కృషి చేసిన కాన్షీరాం 20వ వర్ధంతిని కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు దొబ్బల స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఉపసర్పంచ్ సాయి, వార్డు సభ్యులు బుర్ర రమేష్, విజయ్, కనకసిద్ధిరాములు, ప్రణీత భూమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ సంజీవ్, మాజీ సర్పంచ్ బాలరాజు, మాజీ ఎంపీటీసీ కాషవేణి మహేష్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జాబితాపూర్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



జగిత్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో జెడ్పీహెచ్‌ఎస్ జాబితాపూర్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జన్మంచి శేషచలపతి తెలిపారు. బతుకమ్మ తయారీలో ఉపయోగించే పూల విశిష్టత, వాటి ఔషధ గుణాలను వివరించారు. విద్యార్థులు పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఇటీవల విడుదలైన బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసి ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా అమరేశ్వరి, సరిత వ్యవహరించారు. ఆత్మచరణ్, శ్రీధర్, రాజసాగర్, రమేష్, సుధాకర్ విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు.

## డిసెంబరు 15లోగా మెడికల్ కాలేజీ పూర్తవ్వాలి

**మాజీమంత్రి జీవన్‌రెడ్డి డిమాండ్**



జగిత్యాల, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల వైద్య కళాశాల భవనాల నిర్మాణం పూర్తి చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విమర్శించారు. డిసెంబరు 15లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణతోపాటు వైద్య విద్యకు ప్రాధాన్యమిచ్చిందని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇతర జిల్లాల్లో వైద్య కళాశాలల భవనాలు పూర్తయి నప్పటికీ జగిత్యాలలో ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. కనీస వసతులు లేక వైద్య విద్యార్థులు ఆందోళన చేయడం బాధాకరమన్నారు. ప్రాణహిత జలాలను వినియోగించుకోవాలని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 6 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, పంటలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న జిల్లాల ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించి తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నాయకులు, కవులు, కళాకారులను సన్మానిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు తెలిపారు. సమావేశంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కిడ్స్ కాన్వెంట్‌లో బతుకమ్మ సంబరాలు



వేములవాడ అర్బన్, అక్టోబర్ 9 (ఈవార్తలు): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్ర దాయ దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ హసన్ ఫసి ఉల్లాహ్, ప్రిన్సిపల్ దరక్షణ్ వస్ఫియ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహిం చినట్లు తెలిపారు. బతుకమ్మను పూలతో పేర్చి అందరూ కలిసి ఆడుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థినులు పేర్కొన్నారు. పాఠశాల ప్రాంజ గణం పండుగ వాతావరణాన్ని తలపించింది.



## వేములవాడ ఆసుపత్రికి సీ-ఆర్మ్ యంత్రం

**పేదలకు మోకాళ్ల శస్త్రచికిత్సలు మరింత సులభం**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 9 (ఈవార్తలు): వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్లకు సంబంధించిన శస్త్రచికిత్సల నిర్వహణకు అవసరమైన సీ-ఆర్మ్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ యంత్రం లేకపోవడంతో ఆపరేషన్ల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, తాజాగా యంత్రాన్ని సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఉచితంగా మోకాళ్ల శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించి, ప్రాంత ప్రజలకు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు.




## అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించిన వెంటనే తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది సంబంధిత వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ప్రతి మంగళవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ప్రతి మంగళవారం 10 నిమిషాలు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో వసతులు, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ, సేవల మెరుగుదలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు దృష్టి సారించాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెల నమోదు చేసి, అవసరానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలను ఆహారంలో భాగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. పిల్లల్లో ఎదుగుదల లోపాలు, రక్తహీనత, పోషకాహార లోపం, వినికిడి, మాట, కదలికలకు సంబంధించిన సమస్యలు లేదా పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించినప్పుడు అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని జిల్లా ప్రారంభ జోక్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తారని వివరించారు. అవసరమైతే హైదరాబాద్‌లో ఉన్నత వైద్య సేవలు కల్పిస్తారని చెప్పారు. తనిఖీ సమయంలో బరువు కొలిచే యంత్రం వినియోగంలో లేకపోవడాన్ని గుర్తించి, దాని కోసం ప్రత్యేక గది, ఇతర ఏర్పాట్లు చేయించి తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): 33 ఏళ్ల చరిత్ర కలిగిన సామాజిక, సాంస్కృతిక చైతన్య వేదిక వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో జాతీయ ఎక్సలెన్స్ అవార్డులు, జాతీయ స్ఫూర్తి రత్న పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రముఖ పారిశ్రామిక, రాజకీయ, సినీ, టెలివిజన్ రంగాల ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, ఆసుపత్రులు, వైద్యులు, నృత్యకారులు, వ్యాఖ్యాతలు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు, వ్యాపారవేత్తలు, ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు, హోటళ్లు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు, గాయకులు, రచయితలు, కళా-సాంస్కృతిక రంగాలవారు, వస్త్రాలంకరణ-సౌందర్య రంగ నిపుణులు, యూట్యూబర్లు, యోగా శిక్షకులు, పురోహితులు, రైతులు, శిక్షణా సంస్థల నిర్వాహకులు తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చు. నమోదులు ప్రారంభమయ్యాయి. ముందుగా నమోదు చేసుకున్నవారికి ప్రాధాన్యం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8096677409 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ




**పీఎం ఈ-విద్య ఛానళ్ల కోసం**

**పాఠ్యాంశాల రూపకల్పన**

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతికత ఆధారంగా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పీఎం ఈ-విద్య డీటీహెచ్ ఛానళ్ల కోసం పాఠ్యాంశాల రూపకల్పనపై ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ నిర్వహించారు. అక్టోబరు 6 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని టీ-శాట్ కార్యాలయంలో సీఐఈటీ-ఎన్‌సీఈఆర్‌టీ, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠ్యాంశాలకు అనుగుణంగా స్క్రిప్ట్ రచన, దృశ్య ప్రణాళిక రూపకల్పన, నిర్మాణానికి ముందస్తు ఏర్పాట్లు, చిత్రీకరణ, అనంతర సవరణ ప్రక్రియలపై ఎన్‌సీఈఆర్‌టీ నిపుణులు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో విద్యా వీడియోలను రూపొందించి, బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించే విధానాలను అభ్యసింపజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి చందుర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కాపిల్ల నరేష్, జోగాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య, తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి శిక్షణలో పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ డైరెక్టర్ గాజర్ల రమేష్, టీ-శాట్ సీఈఓ వేణుగోపాల్, తెలంగాణ పీఎం ఈ-విద్య సమన్వయకర్త కోమల్ అరోరా పాల్గొని ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ శిక్షణతో ఆకర్షణీయమైన, నాణ్యమైన బోధనా వీడియోలను రూపొందించేందుకు అవసరమైన నైపుణ్యాలు లభించాయని నిర్వాహకులు తెలిపారు.

... ఇలా చెప్పుకుంటూ పోతే కోల్‌కతాలోని సీఎస్ఐఆర్-సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీజీసీఆర్ఐ) ఘనతలు ఇంకెన్నో. ఇంటర్నెట్‌లో సమాచారం వేగంగా చేరడం నుంచి వైద్య చికిత్సలు, పరిశ్రమల్లో యంత్రాల పర్యవేక్షణ, రక్షణ రంగంలో అత్యాధునిక పరికరాల తయారీ వరకు ఆప్టికల్ ఫైబర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సాంకేతికతలో భారత్ సొంతంగా మరింత సామర్థ్యాన్ని సాధించే దిశగా కోల్‌కతాలోని సీఎస్ఐఆర్-సీజీసీఆర్ఐ పరిశోధనలు చేస్తోంది. ప్రత్యేక ఆప్టికల్ ఫైబర్ల తయారీ, అధిక శక్తి లేజర్ల అభివృద్ధి, వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే పరికరాలు, పరిశ్రమల్లో ప్రమాదాలను ముందుగానే గుర్తించే సెన్సర్ల తయారీలో ఈ సంస్థ పురోగతి సాధించింది.

నాలుగు దశాబ్దాలకు పైగా పరిశోధనలు..
స్వదేశీ సాంకేతికత అభివృద్ధి..
ఒక కిలోవాట్ ఫైబర్ లేజర్ అభివృద్ధి..
వైద్య చికిత్సలకు ప్రత్యేక లేజర్ల తయారీ..
99 శాతం కాంతి కలయిక సామర్థ్యం..
ఉక్కు పరిశ్రమల్లో ఉష్ణోగ్రత కొలత..
యంత్రాల్లో లోపాలను ముందుగా గుర్తించడం..
బిస్మత్ ఆధారిత ప్రత్యేక ఫైబర్ల అభివృద్ధి..
రక్షణ రంగానికి ప్రత్యేక కాంతి పరికరాల తయారీ..






# సర్జరీల్లో ఆప్టికల్ లేజర్!



## థూలియం ఫైబర్ లేజర్ ఆవిష్కరణ.. సాంకేతికతకు భారతీయ పేటెంట్

యంత్రాల్లో ప్రమాదాలను గుర్తించే సెన్సర్ల తయారీ
ఆప్టికల్ ఫైబర్ రంగంలో సీజీసీఆర్ఐ కీలక విజయాలు
వైద్యం నుంచి రక్షణ రంగం వరకు విస్తరిస్తున్న వినియోగం
అధిక శక్తి లేజర్ల తయారీలో పురోగతి
స్వదేశీ సాంకేతికత అభివృద్ధిపై దృష్టి



**(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)**

ఆప్టికల్ ఫైబర్ అంటే కాంతి సంకేతాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపించే అత్యంత సన్నని తీగ. సాధారణంగా ప్రత్యేక గాజుతో తయారయ్యే ఈ తీగ ద్వారా అధిక వేగంతో సమాచారాన్ని పంపవచ్చు. ఇంటర్నెట్, సమాచార వ్యవస్థల్లో వీటి వినియోగం విస్తృతంగా ఉంది. అయితే ఆప్టికల్ ఫైబర్ ఉపయోగం సమాచార ప్రసారంతోనే ముగియదు. వీటిని ఉపయోగించి అధిక శక్తి లేజర్లను తయారు చేయవచ్చు. యంత్రాల్లో ఉష్ణోగ్రత, కంపనాలను గుర్తించవచ్చు. వైద్య చికిత్సల్లో అవసరమైన కాంతిని నిర్దిష్ట ప్రాంతానికి పంపించవచ్చు. ఈ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక లక్షణాలు కలిగిన ఫైబర్లను అభివృద్ధి చేయడంపై సీజీసీఆర్ఐ దృష్టి సారించింది.

### నాలుగు దశాబ్దాలుగా పరిశోధనలు

సీజీసీఆర్ఐలో ఆప్టికల్ ఫైబర్లపై పరిశోధనలు 1980ల ప్రారంభంలోనే మొదలయ్యాయి. ఫైబర్ల తయారీకి అవసరమైన ప్రత్యేక గాజు కడ్డీలను రూపొందించడం, వాటిని సన్నని తీగలుగా మార్చడం, కాంతిని సమర్థంగా ప్రసారం చేసే లక్షణాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై సంస్థ పనిచేస్తోంది. ఫైబర్‌కు అవసరమైన గాజులో ఎర్బియం, యిటర్బియం, థూలియం, బిస్మత్ వంటి మూలకాలను నిర్దిష్ట పద్ధతుల్లో కలపడం ద్వారా ప్రత్యేక లక్షణాలను సాధించవచ్చు. కొన్ని పదార్థాలు కాంతి శక్తిని పెంచేందుకు, మరికొన్ని ప్రత్యేక తరంగదైర్ఘ్యాల్లో కాంతిని ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడతాయి. ఈ ఫైబర్లను తయారు చేయడానికి అవసరమైన సాంకేతికతలతో పాటు, వాటిని పరిశ్రమలు, వైద్య రంగం, రక్షణ పరిశోధనల్లో ఉపయోగించేందుకు అవసరమైన భాగాలనూ సంస్థ అభివృద్ధి చేస్తోంది. కొన్ని సాంకేతికతలకు పేటెంట్లు లభించాయి.

### లోహాలను కత్తిరించే శక్తివంతమైన లేజర్లు

ఆప్టికల్ ఫైబర్ ఆధారంగా తయారయ్యే లేజర్లను లోహాలను కత్తిరించడానికి, రెండు లోహ భాగాలను కలిపేందుకు, వస్తువులపై గుర్తులు వేయడానికి ఉపయోగిస్తారు. పారిశ్రామిక రంగంలో వీటి అవసరం పెరుగుతోంది. సీజీసీఆర్ఐ 1.08 మైక్రోమీటర్ల తరంగదైర్ఘ్యంతో పనిచేసే యిటర్బియం ఫైబర్ లేజర్‌ను అభివృద్ధి చేసింది. ఇది నిరంతర విధానంలో ఒక కిలోవాట్ శక్తిని ఉత్పత్తి చేయగలదు. 2023--24 వార్షిక నివేదికలో సుమారు 970 వాట్ల శక్తిని ఉత్పత్తి చేసిన లేజర్ నమూనా వివరాలనూ సంస్థ వెల్లడించింది. ఈ సాంకేతికతను లోహాల కత్తిరింపు, వెల్డింగ్, పారిశ్రామిక తయారీ వంటి పనులకు ఉపయోగించే అవకాశం ఉంది. దేశీయంగా ఇటువంటి లేజర్లను అభివృద్ధి చేయడం వల్ల విదేశీ పరికరాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు.



### భవిష్యత్తులో స్వదేశీ తయారీపై దృష్టి

ప్రత్యేక ఫైబర్ల తయారీ, అధిక శక్తి లేజర్లు, వైద్య పరికరాలు, పారిశ్రామిక సెన్సర్లు, రక్షణ రంగానికి అవసరమైన భాగాల అభివృద్ధి సీజీసీఆర్ఐ పరిశోధనల్లో కీలకంగా ఉన్నాయి. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఇతర పరిశోధనా కేంద్రాలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ సాంకేతికతలను వాస్తవ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ప్రయోగశాలలో సాంకేతికతను అభివృద్ధి చేయడం ఒక దశ మాత్రమే. దానిని పెద్ద మొత్తంలో తయారు చేయడం, నాణ్యతను స్థిరంగా ఉంచడం, ధరను తగ్గించడం, పరిశ్రమలు లేదా వైద్య రంగంలో వినియోగానికి తగిన పరీక్షలు పూర్తి చేయడం కూడా అవసరం. ఈ దశలను విజయవంతంగా అధిగమిస్తే దేశీయ పరిశ్రమలకు ఉపయోగపడే పరికరాల తయారీలో భారత్ మరింత స్వావలంబన సాధించగలదు. ఆప్టికల్ ఫైబర్‌ను కేవలం సమాచారాన్ని పంపించే తీగగా కాకుండా వైద్యం, రక్షణ, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల భద్రతకు ఉపయోగపడే సాంకేతికతగా అభివృద్ధి చేయడంలో సీజీసీఆర్ఐ పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

### శస్త్రచికిత్సల్లో ఉపయోగపడే లేజర్లు

వైద్య రంగంలోనూ ఆప్టికల్ ఫైబర్ ఆధారిత లేజర్లకు ప్రాధాన్యం పెరుగుతోంది. సీజీసీఆర్ఐ సుమారు 1.94 మైక్రోమీటర్ల తరంగదైర్ఘ్యంతో పనిచేసే థూలియం ఫైబర్ లేజర్‌ను అభివృద్ధి చేసింది. ఈ సాంకేతికతకు భారతీయ పేటెంట్ నంబర్ 521229 మంజూరైంది. ఇలాంటి లేజర్లను మూత్ర సంబంధిత వ్యాధుల చికిత్సతో పాటు కొన్ని మృదు కణజాల శస్త్రచికిత్సల్లో ఉపయోగించే అవకాశాలున్నాయి. శరీరంలోని నిర్దిష్ట ప్రాంతంపై కాంతి శక్తిని కేంద్రీకరించడం ద్వారా చికిత్స నిర్వహించవచ్చు.

### కాంతి శక్తిని సమర్థంగా వినియోగించే పరికరాలు

అధిక శక్తి లేజర్లలో అనేక ఫైబర్ల నుంచి వచ్చే కాంతిని ఒకే మార్గంలోకి కలిపే ప్రత్యేక పరికరాలు అవసరం. వీటిని పంపు కాంబైనర్లు అంటారు. సంస్థ వివరాల ప్రకారం, ఈ పరికరాలు 700 వాట్ల వరకు సమిష్టి పంపు శక్తిని నిర్వహించగలవు. కాంతి శక్తిని కలిపే సామర్థ్యం 99 శాతం వరకు ఉన్నట్లు పేర్కొంది. ఈ భాగాలు అధిక శక్తి లేజర్ల పనితీరును మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. ఆప్టికల్ ఫైబర్లతో ఉష్ణోగ్రత, కంపనం, ఒత్తిడి వంటి మార్పులను గుర్తించవచ్చు. ఈ విధంగా పనిచేసే పరికరాలను ఫైబర్ సెన్సర్లు అంటారు. యంత్రాల్లో లోపాలు ఏర్పడుతున్నాయా? ఉష్ణోగ్రత అసాధారణంగా పెరుగుతోందా? నిర్మాణాల్లో ఒత్తిడి ఎక్కువవుతోందా? వంటి అంశాలను తెలుసుకోవడానికి వీటిని ఉపయోగించవచ్చు. సీజీసీఆర్ఐ ఫైబర్ బ్రాగ్ గ్రేటింగ్ అనే సాంకేతికత ఆధారంగా సెన్సర్లను అభివృద్ధి చేసింది. ఫైబర్‌పై ఉష్ణోగ్రత లేదా ఒత్తిడి మారినప్పుడు దాని నుంచి తిరిగి వచ్చే కాంతిలో మార్పు వస్తుంది. ఆ మార్పులను కొలవడం ద్వారా పరిస్థితిని అంచనా వేయవచ్చు. టాటా స్టీల్, నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీతో కలిసి ఉక్కు కడ్డీల తయారీలో ఉపయోగించే అచ్చులో ఉష్ణోగ్రతను కొలిచే సెన్సర్ వ్యవస్థను సంస్థ అభివృద్ధి చేసింది. దీనికి 2024లో భారతీయ పేటెంట్ లభించింది. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో జనరేటర్లలో ఏర్పడే కంపనాలను గుర్తించే సెన్సర్లపైనా పరిశోధనలు జరిగాయి. వంతెనలు, భవనాల్లో ఒత్తిడి, వంపు, కంపనాలను పర్యవేక్షించేందుకు కూడా ఈ సాంకేతికతను ఉపయోగించవచ్చు. తద్వారా సమస్యలు తీవ్రం కాకముందే గుర్తించి మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంటుంది.

### ప్రత్యేక గాజు ఫైబర్లతో విస్తృత కాంతి ఉత్పత్తి

బిస్మత్ అనే మూలకాన్ని ఉపయోగించి ప్రత్యేక ఆప్టికల్ ఫైబర్లను అభివృద్ధి చేయడంలోనూ సీజీసీఆర్ఐ పరిశోధనలు చేపట్టింది. ఈ ఫైబర్లు 1,100 నుంచి 1,600 నానోమీటర్ల పరిధిలో కాంతిని ఉత్పత్తి చేశాయి. 1,074 నానోమీటర్ల కాంతితో ఉత్తేజపరిచినప్పుడు 220 మిల్లీవాట్ల ఉత్పత్తి శక్తి నమోదైంది. విస్తృత పరిధిలో కాంతిని ఉత్పత్తి చేసే ఇటువంటి ఫైబర్లు సమాచార సంకేతాలను బలోపేతం చేసే పరికరాలు, కాంతి ఆధారిత పరిశోధనలు, వివిధ పదార్థాల లక్షణాలను విశ్లేషించే వ్యవస్థలకు ఉపయోగపడతాయి.

### రక్షణ రంగానికి అత్యాధునిక సాంకేతికతలు

అధిక శక్తి లేజర్లు, ప్రత్యేక ఫైబర్లు, కాంతి ఆధారిత సెన్సర్లు రక్షణ రంగంలోనూ ఉపయోగపడతాయి. సీజీసీఆర్ఐ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్‌తో అనుసంధానమై అధిక శక్తి లేజర్లకు అవసరమైన ప్రత్యేక ఫైబర్లు, కాంతి సంకేతాలను కలిపే పరికరాలు, ఇతర భాగాల అభివృద్ధిపై పనిచేస్తోంది. డీఆర్‌డీఓకు సంబంధించిన పరిశోధన ప్రాజెక్టుల్లో అత్యంత తక్కువ వ్యవధిలో కాంతి పల్సులను ఉత్పత్తి చేసే ఫెమ్టోసెకండ్ ఫైబర్ లేజర్లు, నీటిలోని ధ్వని సంకేతాలను గుర్తించేందుకు ఉపయోగపడే ప్రత్యేక లేజర్ వ్యవస్థలు ఉన్నాయి. ప్రత్యేక ఆప్టికల్ ఫైబర్ల తయారీకి అవసరమైన ప్రాథమిక గాజు కడ్డీలను రూపొందించేందుకు సీజీసీఆర్ఐలో ఆధునిక ఎంసీవీడీ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సదుపాయం ద్వారా కొత్త రకాల ఫైబర్ల తయారీపై పరిశోధనలు చేయడానికి, వాటి లక్షణాలను అవసరానికి అనుగుణంగా మార్చడానికి అవకాశం ఉంటుంది.

సీజీసీఆర్ఐ ప్రత్యేక గాజు విభాగం పారదర్శకమైన, అధిక బలం కలిగిన నానోస్ఫటిక గాజు-సిరామిక్ పదార్థాలను సాయుధ వాహనాలు, ఇతర వినియోగాల కోసం అభివృద్ధి చేస్తోంది. అలాగే, పరారుణ కాంతిని ఉపయోగించే చిత్రీకరణ పరికరాల కోసం చాల్కోజెనైడ్ గాజుపైనా పరిశోధనలు చేస్తోంది. డీఆర్‌డీఓ, సీఎస్ఐఆర్-సీజీసీఆర్ఐ కలిసి సాయుధ వాహనాల కోసం తేలికైన, అధునాతన బుల్లెట్ నిరోధక గాజును అభివృద్ధి చేస్తున్నాయి. ఈ నాలుగేళ్ల ప్రాజెక్టు విలువ రూ.50 కోట్లు. ప్రయోగశాల స్థాయి నుంచి పెద్ద ఎత్తున తయారీకి తీసుకెళ్లడం దీని లక్ష్యం. సాధారణ గాజుతో పోలిస్తే, ఇందులో ప్రత్యేకంగా రూపొందించిన గాజు పదార్థంలో అత్యంత సూక్ష్మమైన స్ఫటికాలను సమానంగా ఏర్పరుస్తారు. ఈ నిర్మాణం గాజుకు అధిక బలం, దృఢత్వం కల్పిస్తూనే పారదర్శకతను నిలబెట్టేలా రూపొందిస్తున్నారు. దీనిని పారదర్శక గాజు-సిరామిక్ పదార్థం అంటారు. బుల్లెట్ నిరోధక గాజు మందం, బరువు తగ్గితే సైనిక వాహనాల మొత్తం బరువు తగ్గుతుంది. దీంతో వాహనం

### ఆర్మీ కోసం ప్రత్యేకంగా..

కదలిక, ఇంధన సామర్థ్యం, అదనపు పరికరాలు లేదా సామగ్రిని మోసుకెళ్లే సామర్థ్యం మెరుగుపడవచ్చు. అయితే ఈ ప్రయోజనాలు తుది పరీక్షలు, వాహనాల్లో అమరిక తర్వాత నిర్ధారణ కావాలి. సీజీసీఆర్ఐ అభివృద్ధి చేసిన మరో ముఖ్యమైన సాంకేతికత ఆర్సెనిక్-సెలీనియం ఆధారిత చాల్కోజెనైడ్ గాజు. ఇది పరారుణ కాంతిని ప్రసారం చేయగలదు. మన కంటికి కనిపించని ఈ కాంతిని ఉపయోగించి రాత్రిపూట వస్తువులను గుర్తించే పరికరాల్లో ఇటువంటి గాజు ఉపయోగపడుతుంది. ఈ రెండు సాంకేతికతలు వేర్వేరు అవసరాలను తీర్చినా, వాటి వెనుక ఉన్న ఉమ్మడి లక్ష్యం స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడం. బుల్లెట్ నిరోధక గాజులో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, బరువు తగ్గిన రక్షణ కవచాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యం ఉంది. నైట్ విజన్ గాజు విషయంలో ఖరీదైన పరారుణ కాంతి ప్రసార పదార్థాలకు దేశీయ ప్రత్యామ్నాయాన్ని అందించే అవకాశం ఉంది.



వయ్యారి చిత్రం



నజియా డేవిడ్సన్




## మార్చి 18న ఫౌజీ రిలీజ్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాలపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉండగా, వాటిలో పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా కొత్త విడుదల తేదీపై ప్రచారం మొదలైంది. తొలుత డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించిన ఈ సినిమాను వాయిదా వేసి, 2027 మార్చి 18న విడుదల చేయాలని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ తేదీపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం కీలక దశలో ఉన్నట్లు సమాచారం. సినిమాలోని భారీ యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేయడంపై చిత్రబృందం దృష్టి పెట్టిందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆలయం నేపథ్యంలో రూపొందించిన ప్రత్యేక సెట్‌లో ఇంటర్వెల్ ఫైట్‌ను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 15 నుంచి క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ ప్రారంభించనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. డిసెంబర్ మొదటి వారానికల్లా ప్రభాస్‌కు సంబంధించిన ప్రధాన సన్నివేశాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మిగిలిన యాక్షన్ ఎపిసోడ్ల చిత్రీకరణ కూడా పూర్తయితే, సినిమా తదుపరి నిర్మాణానంతర పనులపై చిత్రబృందం దృష్టి సారించనుంది. అయితే ఈ షెడ్యూల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

## రామాయణ ప్రమోషన్లకు యష్ దూరం?

కన్నడ రాక్‌స్టార్ యష్ ప్రస్తుతం ఎక్కడా కనిపించకపోవడం సినీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు తన సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన ఈ స్టార్ హీరో, ఇప్పుడు బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఆయన ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'టాక్సిక్' సినిమా గురించి వస్తున్న వార్తలు, ఇతర కన్నడ చిత్రాల విజయాలపై స్పందించకపోవడం ఈ చర్చకు కారణమవుతున్నాయి. అయితే సినిమా ఫలితం, యష్ వ్యక్తిగతంగా మౌనంగా ఉండటానికి గల కారణాలపై అధికారిక స్పష్టత లేదు. 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యష్ తదుపరి చిత్రం 'టాక్సిక్'పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమా గురించి ఎప్పటికప్పుడు వచ్చే వార్తలను ఆసక్తిగా గమనిస్తున్నారు. అయితే ఈ చిత్రం ఫలితంపై నిరాశకు గురయ్యాడనే ప్రచారం ప్రస్తుతం వినిపిస్తోంది. యష్ బయట పెద్దగా కనిపించకపోవడంతో ఆయన అభిమానులు కూడా దీనిపై చర్చించుకుంటున్నారు. సినీ పరిశ్రమలో విజయాలు, పరాజయాలు సహజమే. ఒక సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, మరో చిత్రంతో తిరిగి సత్తా చాటిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాంటి సమయంలో యష్ తదుపరి అడుగులు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి నెలకొంది. అయితే ఆయన మౌనాన్ని సినిమా ఫలితంతో ముడిపెట్టడం సరైనదని చెప్పలేం. దీనిపై యష్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.



## నానా పటేకర్ ఎప్పటికీ ఈవిల్ డెడ్: తనుశ్రీ దత్తా

దివంగత నటుడు నానా పటేకర్‌ను ఉద్దేశించి నటి తనుశ్రీ దత్తా చేసిన 'ఈవిల్ డెడ్' వ్యాఖ్య వివాదాస్పదంగా మారింది. అయితే తన వ్యాఖ్యను ఆమె గట్టిగా సమర్థించుకుంది. తనకు ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా ఆయన 'ఈవిల్ డెడ్' లాంటి వారేనని స్పష్టం చేసింది. అక్టోబర్ 8న నానా పటేకర్ (75) గోవాలోని తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. నానా మరణవార్త తెలిసిన వెంటనే తనుశ్రీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ చేసింది. "ఈ రోజు చాలా విచిత్రమైన రోజు. సాయంత్రం మీడియా అంతా 'ఈవిల్ డెడ్' గురించే అడుగుతుంది. దీనిపై ఎలా స్పందించాలో ఆలోచించాక మాట్లాడతాను. ఆయన కుటుంబానికి నా సంతాపం" అని పేర్కొంది. ఆ తర్వాత ముంబైలో మీడియాతో మాట్లాడుతూ "నాకు ఆయన ఈవిల్ డెడ్ లాంటి వ్యక్తే. బాధితురాలిగా గత ఐదేళ్లుగా నేను ఎంత మానసిక వేదన అనుభవించానో నా కోణంలోంచి చూడండి" అంది. కేసును వెనక్కి తీసుకోవాలని తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని, అనేక ప్రలోభాలు పెట్టారని, అయినా తాను వెనక్కి తగ్గలేదని వివరించారు.



## ఎన్టీఆర్.. మీ అభిమానులు జాగ్రత్త: సజ్జనార్

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన వివాదంలో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రచారం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ ఫొటో వైరల్ కావడం ఈ వివాదానికి కారణమైంది. అయితే, ఆ చిత్రం నిజమైనది కాదని, ఏఐ సాయంతో సృష్టించిన నకిలీ చిత్రమని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై నేరుగా జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశిస్తూ ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'సౌత్ డిజిటల్ మీడియా' పేరుతో ఉన్న ఓ ఖాతాలో అరెస్టుకు సంబంధించిన సమాచారంతో పాటు ఓ ఫొటోను పోస్ట్ చేశారు. ఆ చిత్రంలో ముఖానికి ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి, పక్కన పోలీసు అధికారులు, ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లుగా కనిపించింది. 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన వివాదం నేపథ్యంలో ఈ అరెస్టు జరిగినట్లు ప్రచారం సాగడంతో ఆ ఫొటో వైరల్‌గా మారింది. అయితే, ఈ చిత్రంపై స్పందించిన సజ్జనార్ అది వాస్తవమైన ఫొటో కాదని స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి సృష్టించిన నకిలీ చిత్రాన్ని నిజమైనదిగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యవహారంపై సజ్జనార్ చేసిన ట్వీట్ ప్రత్యేకంగా చర్చకు దారితీసింది.






## శర్వానంద్ 'భోగి'.. ఎగిలి వరంగ సాంగ్ రిలీజ్

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో శర్వానంద్ ఈసారి మాస్ హీరోగా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో ఆయన నటిస్తున్న యాక్షన్ డ్రామా 'భోగి'పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాలోని యాక్షన్‌తో పాటు ఇతర అంశాలను పరిచయం చేయగా.. తాజాగా చిత్రబృందం తొలి పాటను విడుదల చేసింది. 'ఎగిలి వరంగ' పేరుతో వచ్చిన ఈ జానపద గీతం పల్లె జీవనశైలిని, అక్కడి ప్రజల సంస్కృతిని అందంగా ఆవిష్కరిస్తోంది. 'ఎగిలి వరంగ' పాటలో గ్రామీణ జీవితంలోని ఎన్నో కోణాలను చూపించారు.



## విమర్శలకు భయపడను: కత్రినా

బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సోషల్ మీడియా ట్రోలింగ్, బాడీ షేమింగ్‌పై ఘాటుగా స్పందించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలకు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ఆమె అన్నారు. లండన్‌లో తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి జననం తర్వాత ఇటీవల కత్రినా తొలిసారిగా బయట కనిపించినప్పుడు, సోషల్ మీడియాలో ఆమె శరీరాకృతిపై కొందరు నెగటివ్ కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు. "సోషల్ మీడియాలో వచ్చే మాటలు మన ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి కామెంట్లను పట్టించుకుంటూ పోతే, మనకోసం మనం నిర్ణయాలు తీసుకోలేం. ప్రతి విమర్శకు నేను స్పందించి ఉంటే, భయంతో అక్కడే స్తంభించిపోయేదాన్ని" అని కత్రినా వివరించారు. కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తుందని, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె పేర్కొన్నారు.



## నానా పటేకర్ మృతి 'అసహజ మరణం'

బాలీవుడ్ సీనియర్ నటుడు నానా పటేకర్ మృతిపై గోవా పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టపరమైన ప్రక్రియలో భాగంగా అసహజ మరణం (అన్‌నేచురల్ డెత్) కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత' (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 194 కింద ఈ కేసు నమోదైంది. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నితిన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు. గోవాలోని డోనా పౌలా ప్రాంతంలో ఉన్న తన నివాసం నుంచి నానా పటేకర్‌ను మణిపాల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు పంచనామా నిర్వహించనున్నారు. గోవా మెడికల్ కాలేజీలో నిర్వహించిన పోస్టుమార్టం నివేదికను పరిశీలించడంతో పాటు, నానా పటేకర్ కుటుంబ సభ్యులు, ఇతర సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేయనున్నారు. ఆయన మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. నానా పటేకర్ మరణం సహజంగా సంభవించినట్లు తేలితే కేసును మూసివేసే అవకాశం ఉంది. ఒకవేళ అనుమానాస్పద పరిస్థితులు లేదా ఇతరుల ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభిస్తే తదుపరి చట్టపరమైన చర్యలు



## హాకీ టోర్నీ నుంచి పాక్ ఔట్

భారత్ ఆతిథ్యమివ్వనున్న 2026 ఆసియన్ హాకీ ఛాంపియన్స్ ట్రోఫీలో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా కారణాలను చూపుతూ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ నుంచి పాకిస్థాన్ హాకీ జట్టు వైదొలగింది. దీంతో, రిజర్వ్ జట్టుగా ఉన్న బంగ్లాదేశ్‌కు ఆసియన్ హాకీ ఫెడరేషన్ (ఏహెచ్ఎఫ్) టోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే, తమ ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్ఎఫ్), తమ మ్యాచ్‌లను ఏదైనా తటస్థ వేదికకు మార్చాలని ఏహెచ్ఎఫ్‌ను కోరింది. ఈ అభ్యర్థనను హాకీ ఇండియా నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే టోర్నీ జరుగుతుందని స్పష్టం చేయడంతో పాక్ ఈ పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించింది. "మా ఆటగాళ్లు, అధికారుల భద్రత, గౌరవానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తాం" అని పీహెచ్ఎఫ్ అధ్యక్షుడు మొహ్యుద్దీన్ అహ్మద్ వానీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ వైదొలగడంతో ఏహెచ్ఎఫ్ ఆహ్వానం మేరకు బంగ్లాదేశ్ ఈ టోర్నీలో పాల్గొనేందుకు అంగీకరించింది. దీంతో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, చైనా, మలేషియా, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ టైటిల్‌ను గెలుచుకుంది. 2018లో భారత్, పాకిస్థాన్ జాయింట్ విన్నర్స్‌గా నిలవడం గమనార్హం. ఇటీవలి కాలంలో భారత్‌లో జరిగే ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ వంటి టోర్నీలకు కూడా పాక్ జట్టు దూరంగా ఉంది. త్వరలోనే సవరించిన టోర్నమెంట్ డ్రాను ప్రకటించే అవకాశం ఉంది.



## కోహ్లీ ఇప్పుడు మరింత ప్రమాదకారి: ఏబీడీ

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తుత ఫామ్‌పై దక్షిణాఫ్రికా దిగ్గజం, అతడి ఆప్తమిత్రుడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2016లో ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ కనబరిచిన అద్భుతమైన ఫామ్ కంటే ఇప్పుడు ఇంకా మెరుగ్గా ఆడుతున్నాడని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం కోహ్లీ ఎంతో స్వేచ్ఛగా, రిలాక్స్‌డ్‌గా బ్యాటింగ్ చేస్తున్నాడని, అదే అతడి అసలైన బలమని పేర్కొన్నాడు. "ఇది 2016 కంటే మెరుగైన వెర్షన్ అని నేను కచ్చితంగా భావిస్తున్నాను. ఎందుకంటే అతడు చాలా రిలాక్స్‌డ్‌గా ఉన్నాడు. మైదానంలో స్వేచ్ఛగా ఉన్నట్టు కనిపిస్తున్నాడు. ఈ మార్పు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ నుంచే కనిపించింది. మధ్యలో కొన్నాళ్లు పాత అలవాట్లకు వెళ్లినా, ఇప్పుడు వాటిని పూర్తిగా వదిలేశాడు" అని వివరించాడు. "కోహ్లీలో ప్రజలకు తెలియని మరో కోణం ఉందని నేను ఎప్పుడూ చెబుతుంటాను. ఇప్పుడు ఆ కోణం మరింతగా బయటకు వస్తోంది. అతడు ఇతరులపై ఎక్కువ దృష్టి పెడుతున్నాడు" అని ఏబీడీ పేర్కొన్నాడు. డివిలియర్స్ ప్రశంసలకు తగ్గట్టుగానే కోహ్లీ ఇటీవలి ప్రదర్శనలు ఉన్నాయి. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ తన 55వ వన్డే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత 25 ఇన్నింగ్స్‌లలో 50.44 సగటుతో 1261 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు, ఏడు అర్ధసెంచరీలు ఉన్నాయి. ముఖ్యంగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతడి ఆటలో దూకుడు పెరిగింది, సిక్స్‌లు ఎక్కువగా కొడుతున్నాడు. తదుపరి ప్రపంచకప్ తన చివరిదని కోహ్లీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. టెస్టులు, టీ20 ఫార్మాట్‌ల నుంచి రిటైరై, కేవలం వన్డేలు, ఐపీఎల్‌పైనే దృష్టి సారించిన తర్వాత కోహ్లీ ఈ కొత్త అవతారంలో కనిపిస్తున్నాడు.

## రెండో వన్డేలోనూ భారత్ ఓటమి

### సిరీస్ సొంతం చేసుకున్న ఆసీస్

భారత పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా-ఎ జట్టు మూడు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. పాండిచ్చేరి వేదికగా శుక్రవారం జరిగిన రెండో అనధికారిక వన్డేలో ఆస్ట్రేలియా చేతిలో 69 పరుగుల తేడాతో భారత్ ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఎ జట్టు 49.5 ఓవర్లలో 275 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (67), జోష్ ఫిలిప్ (58) అర్ధసెంచరీలు సాధించారు. భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ 3 వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత జట్టు 45.2 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. రజత్ పాటీదార్ (67) అర్ధసెంచరీ సాధించగా.. చివర్లో అనుకుల్ రాయ్ (34 నాటౌట్) ఒంటరిపోరాటం చేసినప్పటికీ మిగతావారి నుంచి సహకారం కరువైంది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ జాన్సన్ 3 వికెట్లు తీయగా, రిలే మెరిడిత్, తన్వీర్ సంఘాలు చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య మూడో వన్డే అక్టోబర్ 11న జరగనుంది. అంతకముందు జరిగిన రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో సొంతం చేసుకుంది. బ్యాటింగ్‌లో ఏడు బంతుల్లో 14 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో మూడు కీలక వికెట్లు తీసిన స్పెన్సర్ జాన్సన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు.



# రేయ్.. ఏంట్రా ఇది!

సంజూ ఇన్నింగ్స్ వృథా



### 250 పరుగులను ఉదేశారు!.. షాయ్ హోప్ సంచలన శతకం

### భారత్ కు ఊహించని ఓటమి.. 6 వికెట్ల తేడాతో విండీస్ విజయం

రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు చారిత్రక విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్; 45 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత సెంచరీతో జట్టును గెలిపించాడు. టీ20 చరిత్రలో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక పరుగుల ఛేదన కావడం విశేషం. అంతేకాదు, అంతర్జాతీయ క్రికెట్లో ఇది రెండో అత్యధిక ఛేదన. భారీ లక్ష్య ఛేదనలో విండీస్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. యువ బౌలర్ మయాంక్ యాదవ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌కు ఆశలు రేపాడు. అయితే, ఆ తర్వాత షెర్ఫాన్ రదర్‌ఫోర్డ్ (84; 37 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) కెప్టెన్ హోప్‌తో కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు. సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించిన హోప్, అదే బంతితో తన సెంచరీని పూర్తి చేసుకోవడం గమనార్హం. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (82; 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతనికి తోడుగా ఇషాన్ కిషన్ (43), శ్రేయస్ అయ్యర్ (40), తిలక్ వర్మ (44) కూడా రాణించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. అయితే, బౌలర్ల వైఫల్యంతో ఈ స్కోరును కాపాడుకోలేకపోయింది. మయాంక్ యాదవ్ 3 వికెట్లు తీసినా మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్ ను విండీస్ 1-1తో సమం చేసింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈ నెల 11న ఇండోర్ లోని హోల్కర్ స్టేడియంలో జరగనుంది.

## ఐపీఎల్ వల్లే భువీ రీఎంట్రీ



టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత టీ20 జట్టులోకి వచ్చాడు. అతడి పునరాగమనానికి ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో పాటు అపార అనుభవం కూడా కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించాడు. యువ బౌలర్లు బాగా రాణిస్తున్నప్పటికీ, కీలక సమయాల్లో అనుభవం కూడా అవసరమని అభిప్రాయపడ్డాడు. భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన అతడు.. ఐపీఎల్‌లో మాత్రం తన సత్తా చాటాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతూ 2025 సీజన్‌లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 28 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లలో కలిపి 45 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ రెండు సీజన్లలో ఆర్‌సీబీ వరుసగా ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది. ఇంగ్లండ్ పర్యటన సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం, యువ బౌలర్లు ఎక్కువగా ఉండటంతో అనుభవజ్ఞుల అవసరం కనిపించిందని కోటక్ చెప్పాడు. యువ ఆటగాళ్లు బాగా ఆడుతూ జట్టులోకి వస్తున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో అనుభవానికి కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించాడు. ఐపీఎల్‌లో భువనేశ్వర్ నిలకడగా రాణించడం కూడా అతడి ఎంపికకు కారణమై ఉండొచ్చని పేర్కొన్నాడు. మరో సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పునరాగమనంపై మాత్రం కోటక్ స్పష్టమైన వ్యాఖ్యలు చేయలేదు. షమీ కూడా మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తున్నాడని, అతడి ప్రదర్శనతో పాటు జట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకుని సెలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని చెప్పాడు. తాను సెలెక్టర్‌ను కానందున షమీ ఎంపికపై తుది నిర్ణయం చెప్పలేనని స్పష్టం చేశాడు. వీవీఎస్ లక్ష్మణ్‌ను సెలక్షన్ సమావేశాల్లో భాగం చేయడం, జట్టు యాజమాన్యం నుంచి సెలెక్టర్లకు ఆటగాళ్ల గాయాల సమాచారాన్ని చేరవేసే బాధ్యత అప్పగించారన్న వార్తలపైనా కోటక్ స్పందించాడు. ఈ విషయం తనకు కూడా మీడియా ద్వారానే తెలిసిందని చెప్పాడు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం వెనుక సరైన కారణం ఉంటుందని భావిస్తున్నానని తెలిపాడు.

## వికెట్ కీపర్‌గా యశస్వి జైస్వాల్!



భారత క్రికెట్ జట్టు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన ఆటలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో ఉన్నాడు. ఇప్పటికే తన అద్భుతమైన బ్యాటింగ్‌తో పాటు అప్పుడప్పుడు లెగ్ స్పిన్‌తో ఆకట్టుకుంటున్న ఈ యువ కెరటం, ఇప్పుడు వికెట్ కీపింగ్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని ముంబై రంజీ జట్టు కొత్త కెప్టెన్ సిద్ధేశ్ లాడ్ స్వయంగా వెల్లడించాడు. టీ20 క్రికెట్ ప్రభావంతో ఆటగాళ్లు బహుముఖ ప్రజ్ఞ కనబరచడం తప్పనిసరిగా మారుతున్న తరుణంలో జైస్వాల్ ఈ కొత్త నైపుణ్యంపై దృష్టి పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ ప్రారంభానికి ముందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సిద్ధేశ్ లాడ్ మాట్లాడాడు. "యశస్వి వికెట్ కీపింగ్ ప్రారంభించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ముంబై జట్టు లేదా భారత జట్టు కోసం కీపింగ్ చేయాలనేది అతని లక్ష్యంగా కనిపిస్తోంది. తన ఆటలో మరింత వైవిధ్యాన్ని జోడించాలనే ఉద్దేశంతోనే జైస్వాల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు" అని లాడ్ వివరించాడు. రంజీ సీజన్‌కు ముందు జరిగిన ఒక ప్రాక్టీస్ మ్యాచ్‌లో జైస్వాల్ దాదాపు 10 ఓవర్ల పాటు వికెట్ కీపింగ్ చేసినట్లు కూడా సమాచారం. గతంలో భారత జట్టులో రాహుల్ ద్రావిడ్ కూడా స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఉంటూ, జట్టు సమతుల్యం కోసం వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. ఇప్పుడు జైస్వాల్ కూడా అదే బాటలో పయనించడం ఆసక్తికరంగా మారింది.

## స్టీవ్‌వాను దాటేసిన స్మిత్



ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ తన కెరీర్లో మరో రికార్డు సాధించాడు. టెస్టుల్లో రన్ మెషీన్‌లా పేరొందిన అతడు తమ దేశ దిగ్గజం స్టీవ్ వాను అధిగమించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆసీస్ తరఫున అత్యధిక పరుగుల వీరుల జాబితాలో మూడో స్థానం దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో డర్బన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో స్మిత్ ఈ మైలురాయిని అందుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో పాపులర్ ఆటగాడైన స్టీవ్ స్మిత్ మరో మైలురాయిని సాధించాడు. ఫ్యాబ్-4లో ఒకడైన అతడు టెస్టుల్లో అత్యధిక పరుగులు బాదిన ఆస్ట్రేలియా క్రికెటర్ల జాబితాలో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికాతో డర్బన్ టెస్టులో అతడు మాజీ కెప్టెన్ స్టీవ్ వా రికార్డును బద్ధలు కొట్టాడు. పింక్ బాల్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 25 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద స్టీవ్‌ను నాలుగో స్థానానికి నెట్టేశాడీ రన్ మెషీన్. ప్రస్తుతం స్మిత్ ఖాతాలో 10,945 రన్స్ ఉండగా.. వా పేరిట 10,927 పరుగులున్నాయి.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 10-10-2026, జగిత్యాల

www.evarthalu.com

నేటి ఈవార్తలు



నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# మానవ హక్కుల పోరాటానికి నోబెల్ గౌరవం!

మానవ హక్కుల పరిరక్షణ, సమానత్వం, న్యాయం.. ఇవి కేవలం ఆదర్శవంతమైన పదాలు కావు. ప్రతి మనిషి గౌరవంగా జీవించేందుకు అవసరమైన ప్రాథమిక హక్కులు. అయితే ప్రపంచంలో నేటికీ జాతి, మతం, వర్ణం, ప్రాంతం పేరుతో వివక్ష కొనసాగుతూనే ఉంది. అధికార బలంతో బలహీనుల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానవ హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తుల పోరాటం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. దక్షిణాఫ్రికాకు చెందిన భారత సంతతి న్యాయవాది నవనీతం 'నవి' పిళ్లై ప్రస్థానం ఈ కోణంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటుంది. 1941లో డర్బన్‌లో భారతీయ సంతతి కుటుంబంలో జన్మించిన నవి పిళ్లై, వర్ణవివక్ష పాలనలో పెరిగారు. సమాజంలో మనుషులను వారి చర్మవర్ణం ఆధారంగా విభజించిన ఆ వ్యవస్థలో వివక్షను ప్రత్యక్షంగా చూసిన ఆమె, న్యాయాన్ని తన పోరాట సాధనంగా మలుచుకున్నారు. దక్షిణాఫ్రికాలో న్యాయవాద వృత్తిని చేపట్టిన తొలి భారత సంతతి మహిళల్లో ఒకరిగా గుర్తింపు పొందడం ఆమె సాధించిన చారిత్రక విజయాల్లో ఒకటి. వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడినవారి తరఫున వాదించడంతో పాటు, ఖైదీల పట్ల అమలైన వివక్షాపూరిత విధానాలను ప్రశ్నించడం ద్వారా న్యాయవ్యవస్థలో మానవీయ విలువల ప్రాధాన్యాన్ని చాటారు. వర్ణవివక్ష అంతమైన తర్వాత కూడా ఆమె పోరాటం ఆగలేదు. అంతర్జాతీయ నేరాల విచారణలో భాగంగా రువాండా అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో న్యాయమూర్తిగా సేవలందించారు. అక్కడ లైంగిక హింసను జాతిసంహార నేరంగా గుర్తించడంలో కీలకమైన న్యాయపరమైన పరిణామాలకు ఆమె కృషి తోడ్పడింది. యుద్ధాలు, అంతర్గత ఘర్షణల సమయంలో మహిళలపై జరిగే లైంగిక దాడులను సాధారణ నేరాలుగా కాకుండా, సమాజాలను ధ్వంసం చేసే తీవ్రమైన నేరాలుగా పరిగణించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు ప్రపంచానికి గుర్తుచేశాయి. అనంతరం అంతర్జాతీయ నేరాల న్యాయస్థానంలో న్యాయమూర్తిగా, 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా ఆమె సేవలందించారు. ఈ బాధ్యతలు వ్యక్తిగత ప్రతిభకు గుర్తింపే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల పరిరక్షణకు ఆమె చేసిన కృషికి నిదర్శనం. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రాంతాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరిపిన ఐక్యరాజ్యసమితి కమిషన్‌కు నాయకత్వం వహించడం కూడా ఆమె ప్రస్థానంలో కీలక ఘట్టం. నవి పిళ్లై వంటి న్యాయవాదుల జీవితాలు ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేస్తాయి. న్యాయం అనేది బలవంతులకే పరిమితమైన ప్రత్యేక హక్కు కాదు. బాధితులకు అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక హామీ. ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో తెలుసుకోవాలంటే, అది మెజారిటీ ప్రజల హక్కులను మాత్రమే కాకుండా, అణగారిన వర్గాల హక్కులను ఎంతగా కాపాడుతోందో పరిశీలించాలి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, బాధితుల తరఫున నిలబడటం, అసమానతలను ఎదుర్కోవడం ద్వారానే ప్రజాస్వామ్య విలువలు బలోపేతమవుతాయి. భారత సంతతి మహిళ అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల పరిరక్షణకు చేసిన కృషి భారతీయ సమాజానికి గర్వకారణమే. అయితే ఇలాంటి వ్యక్తుల విజయాలను కేవలం జాతీయ గర్వానికి పరిమితం చేయకూడదు. వారి జీవితాల్లోని విలువలను మన సమాజంలోనూ ఆచరణలో పెట్టాలి. కులం, మతం, వర్గం, లింగం ఆధారంగా వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. చట్టం ముందు అందరూ సమానులనే సూత్రాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ నిరూపించాలి.

# పల్లె గీతాల చైతన్య సవ్వడి..!




అనేక ప్రభావాలు, సాహిత్య అనుభవాల నుంచి తనను తాను మేలిమిగా మలుచుకుంటూ, ముందున్న దారి నుంచి స్ఫూర్తి పొంది, తనదైన కొత్త సృజనతో పాటను పాలమూరు నేల నుంచి ప్రపంచానికి పరిచయం చేస్తున్నాడని ప్రముఖ రచయిత గోరటి వెంకన్న తన ముందుమాటలో కల్వకోల్ మద్దిలేటి సాహితీ ప్రయాణాన్ని వివరిస్తూ 'వనమంచు పల్లె' పాటలకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మద్దిలేటి సామాజిక స్పృహతో, వామపక్ష భావజాలంతో రచయితగా, గాయకుడిగా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. పోరుబాటలో ఒరిగిపోయిన వీరులను చూసి, అమరవీరులు కలిసిపోయిన పోరుదారులను తలచుకుని, అమరుల త్యాగాల నుంచి వెలువడిన సూర్యకిరణాలను తన పాటల్లో ప్రతిబింబిస్తూ సాగే ఆయన సృజనాత్మక ప్రయాణం ప్రత్యేకమైనది. 'గట్లదారుల గరకలెంట నడసి నడసి నాగులన్న నల్లమలను రక్షించరన్న' అంటూ కొత్త గీతాన్ని ఆలపిస్తున్నారు. కొలిమిని తలపించే ఎండల్లో కొమ్మల నీడలా నిలిచిన నేస్తాన్ని మరిచిపోలేకపోతున్నారు. సమతా రాజ్యం వచ్చే వరకు సమరాన్ని ఆపేది లేదంటూ శపథం చేస్తున్నారు. చిన్ననాటి చిలిపితనాన్ని ఎన్నో వింతలు, విశేషాలతో అందరి హృదయాలను తాకేలా ఆవిష్కరించారు. 'అందమైన చందమామమ్మా.. నా ఆడపిల్ల / అంతులేని బాధలోయమ్మ.. నా ఆడపిల్ల' అంటూ విభిన్నమైన శైలిలో ఆకట్టుకుంటున్నారు. 'వనమంచు పల్లె' పాటల్లో వెన్నెలమ్మ వెలుగులతో అజ్ఞానాంధకారాన్ని తరిమికొట్టే ప్రయత్నం కనిపిస్తుంది. 'ఏం పాడుదురా మా పేదోళ్ల బతుకు పాట / ఏం చెప్పుదురా మా పేదోళ్ల బతుకు బాధ' అంటూ పేదల జీవితాల్లోని ఆవేదనను గీతంగా, ఆందోళనను రాగంగా మలుచుకుని ప్రజల పక్షాన నిలుస్తున్నారు. కానుగ చెట్టు నీడన కన్నుమూసి నిద్రిస్తుంటే, కలలో కోయిలమ్మ కమ్మని పాటతో పిలిచిన వైనాన్ని సామాజిక చైతన్యానికి అన్వయిస్తూ అభ్యుదయ బాటలో రైతుల పక్షాన రణగీతాలు ఆలపిస్తున్నారు. ఎర్రని మల్లెలతో విప్లవ పంథాను అనుసరిస్తున్నారు. 'అదిగో చూడు కొల్లాపురము / అడివమ్మ వడిలోని అందాల పురము' అంటూ కొల్లాపురాన్ని ప్రపంచ పటంపై కనిపించేలా, తన గీతాలతో ప్రతిధ్వనించేలా చేస్తున్నారు. 'పొద్దున బువ్వుంటే మాపున బువ్వుండదు.. మాపున బువ్వుంటే పొద్దున బువ్వుండదు' వంటి బలమైన, ఆర్ద్రత నిండిన వాక్యాలను పాటల రూపంలో మలిచి పాఠకుల హృదయాలను కదిలిస్తున్నారు. పేదల ఆకలి బాధలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తున్నారు. 'రాజ్యాంగమే రాసి మా తలరాతలు మార్చినవో / తలరాతలు మార్చి మా ఎతలను తీర్చిన దైవమా' అంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను చిరుదీపపు కిరణాలుగా అభివర్ణిస్తున్నారు. 'మా మంగళన్న' అంటూ బహుజన వాదాన్ని వినిపిస్తున్నారు. శాస్త్రీయ సమాజాన్ని కాంక్షిస్తూ, బౌద్ధం బోధించే ప్రేమతత్వాన్ని తన పాటల ద్వారా చాటుతున్నారు. అచ్చమైన పల్లె పదాలతో నాన్నను కీర్తిస్తూ, మనందరి నాన్నలను గుర్తు చేస్తున్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసి, ప్రజల్లో ప్రాణభయాన్ని నింపిన కరోనా మహమ్మారి గల్లీగల్లీకి వచ్చిందంటూ విజ్ఞాన పాఠాలు బోధిస్తున్నారు. 'ఇంట్లో ఉండుర ఓరన్న' అంటూ ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు. కళాకారుల ఆకలికి ఆర్తిగీతమై ఆలపిస్తున్నారు. అంటరానితనం అనే మంటలను పాతరేసే జాతరగా అంబేడ్కర్ జాతర డప్పు మోగిస్తున్నారు. ఇలా తన పుస్తకం నిండా 45 విభిన్న అంశాలను స్పృశిస్తూ, సామాజిక మార్పే లక్ష్యంగా పల్లె ప్రజలు మాట్లాడుకునే మాటలను పాటలుగా మలిచి, తన గాత్రంతో వినిపించే ప్రయత్నం చేశారు. పల్లె బతుకు చిత్రాన్ని ప్రతి పదంలోనూ ఆవిష్కరించారు. సమాజంపై, సామాజిక బంధాలపై తనకున్న అభిమానాన్ని అక్షరాలుగా మలిచారు. త్యాగాల ఎర్రని పూలలో మెరుపు పూలై వికసించారు. విప్లవ గీతాల వనంలో ప్రత్యేక గొంతుకగా నిలిచారు. 'కవి పాత్ర పెరిగింది. గాయకుల పని పెరిగింది. ఉద్యమకారుల అవసరం పెరిగింది. మూడు పాత్రల్లోనూ మద్దిలేటి ముందున్నాడు. వనమంచు పల్లె పాటలతో మన ముందున్నాడు' అంటూ ప్రముఖ రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి చెప్పిన మాటలు అక్షరసత్యాలని అంగీకరించక తప్పదు. పాట లేకుండా జీవితానికి వికాసం లేదు. పాట లేకపోతే ప్రపంచానికి వినోదం లేదు. ఏ భాషకైనా, ఏ జాతికైనా పాట అనివార్యం. కల్వకోల్ మద్దిలేటి అక్షరాల్లోని అభ్యుదయ కిరణాలు సమాజంలో స్వేచ్ఛగా ప్రసరించాలని, ప్రజల మధ్య సంచరించాలని, జ్ఞానోదయానికి దోహదపడి వికసించాలని ఆకాంక్షిస్తున్నాను. ఇలాంటి పుస్తకాలను ఆయన మరెన్నో రచించాలని, తన గుండె చప్పుడుకు పాటల రూపంలో ప్రాణం పోయాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.


- ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

తంగేడు పూల తళతళలు..
గునుగు పూల గుబాళింపులు..
గుమ్మడి పూల గౌరమ్మ..
గొంతెత్తి పాడే పల్లెపాటలు..
లయబద్ధంగా కదిలే
ఆడపడుచుల అడుగులు..
ఇవన్నీ కలిస్తే బతుకమ్మ..!
ఇంతటి గొప్ప ప్రకృతి
పండుగకు వేళైంది..!



# ఆడపడుచుల ఐక్యత.. బతుకమ్మ

పూలను పేర్చి దేవతను కొలవడమే కాదు.. ప్రకృతిని ఆరాధించడం, ఆడబిడ్డలను గౌరవించడం, ఆత్మీయతలను పంచుకోవడం, తరతరాల సంస్కృతిని సజీవంగా నిలపడమే బతుకమ్మ పండుగ పరమార్థం. తెలంగాణ మట్టి పరిమళానికి, పల్లె జీవన సౌందర్యానికి, మహిళల సమష్టి చైతన్యానికి ప్రతీక బతుకమ్మ. పూలతో కొలిచే ప్రకృతి ఆరాధనగా, పాటలతో పలికే ప్రజల జీవన తాత్త్వికతగా, ఆడపడుచుల ఐక్యతకు వేదికగా ఈ పండుగ తరతరాలుగా కొనసాగుతోంది. భక్తి, సౌందర్యం, సామాజిక సమానత్వం, జానపద సాహిత్యం..

**ఇలా అనేక జీవన పార్శ్వాలను తనలో ఇముడ్చుకున్న బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. బతుకమ్మను కేవలం పూల పండుగగా చూడటం దాని అంతరార్థాన్ని పరిమితం చేయడమే. ప్రకృతిలో లభించే పూలను సేకరించి అందంగా పేర్చి, మధ్యలో పసుపుతో గౌరమ్మను ప్రతిష్ఠించి, సామూహికంగా పూజించడం వెనుక ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని అనుబంధం దాగి ఉంది.**

ప్రకృతి ప్రసాదించిన సంపదను కృతజ్ఞతతో స్వీకరించడం, దాని పట్ల గౌరవాన్ని చాటడం ఈ పండుగలోని అంతర్లీన సందేశం. తెలంగాణ సంప్రదాయంలో బతుకమ్మను గౌరీదేవి స్వరూపంగా భావించి పూజిస్తారు. శక్తి ఆరాధనలో అంతర్భాగంగా స్త్రీత్వాన్ని, సృజనశీలతను, జీవనదాతృత్వాన్ని గౌరవించే ఆచారంగా బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. లక్ష్మి, గౌరి, సరస్వతి వంటి దేవతా స్వరూపాలను స్త్రీశక్తి విభిన్న పార్శ్వాలుగా భావించే భక్తి సంప్రదాయాలు ఈ పండుగలో ప్రతిఫలిస్తాయి. పూలను వరుసలుగా పేర్చి గోపురాకారంలో బతుకమ్మను తీర్చిదిద్దడం, దాని మధ్యలో గౌరమ్మను నిలపడం ఈ పండుగకు ప్రత్యేక ఆకర్షణ. ఈ అమరికలో భక్తితోపాటు సౌందర్య దృష్టి, తరతరాలుగా సంక్రమించిన స్థానిక జ్ఞానం కనిపిస్తాయి. శ్రీచక్రం వంటి శక్తి ఆరాధనా సంప్రదాయాలతో బతుకమ్మ రూపాన్ని పోల్చి చూసే ఆధ్యాత్మిక భావనలు కూడా ఉన్నాయి. అయితే వీటిని చారిత్రకంగా నిర్ధారితమైన సంబంధాలుగా కాకుండా ఆధ్యాత్మిక ప్రతీకలుగా అర్థం చేసుకోవాలి. తంగేడు, గునుగు, బంతి, గుమ్మడి తదితర పూలతో బతుకమ్మను పేర్చడం ఈ పండుగ ప్రత్యేకత. పల్లెల్లో పొలాల గట్లపై, చెరువుల పరిసరాల్లో, ఇళ్ల చుట్టూ సహజంగా లభించే పూలకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. ప్రకృతిలోని వైవిధ్యాన్ని రంగుల రూపంలో ఒకచోట చేర్చే ఈ ఆచారం పర్యావరణంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. బతుకమ్మకు నిజమైన జీవం పోసేవి జానపద గీతాలు. తరతరాలుగా మహిళల నోటినుంచి నోటికి ప్రయాణించిన ఈ పాటల్లో పురాణ గాథలు, కుటుంబ సంబంధాలు, ప్రేమానురాగాలు, సామాజిక జీవనం, స్త్రీల అనుభవాలు ప్రతిధ్వనిస్తాయి. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో", "ఒక్కేసి పువ్వేసి చందమామ" వంటి గీతాలు పండుగకు ప్రత్యేకమైన లయను, భావోద్వేగాన్ని అందిస్తాయి. సీతమ్మ, శివపార్వతులు, శ్రీకృష్ణుడు వంటి పౌరాణిక పాత్రలతోపాటు పల్లె ప్రజల దైనందిన జీవితాన్ని ప్రతిబింబించే గేయాలు కూడా బతుకమ్మ పాటల్లో చోటు చేసుకున్నాయి. వీటిలో వినోదం మాత్రమే కాదు.. సమాజపు ఆచారాలు, సంబంధాలు, ఆకాంక్షలు, అప్పటి జీవన పరిస్థితుల ఆనవాళ్లు కనిపిస్తాయి. పుస్తకాలకే పరిమితం కాని ఈ మౌఖిక సాహిత్యం ప్రజల జ్ఞాపకాల్లో నిలిచి, ఒక తరం నుంచి మరో తరానికి సాంస్కృతిక వారసత్వాన్ని అందిస్తోంది. బతుకమ్మ పండుగలోని మరో గొప్ప విశేషం సామూహిక భాగస్వామ్యం. మహిళలు కొత్త వస్త్రాలు ధరించి, పూల బతుకమ్మలను మధ్యలో ఉంచి వలయాకారంలో చేరి, చప్పట్ల లయకు అనుగుణంగా పాటలు పాడుతూ ఆడతారు. పండుగ చివరి రోజున బతుకమ్మలను చెరువులు, ఇతర జలాశయాల వద్దకు తీసుకెళ్లి పూజించి, సంప్రదాయం ప్రకారం నిమజ్జనం చేస్తారు. అనంతరం ప్రసాదాలను, పిండి వంటలను పరస్పరం పంచుకుంటారు. ఈ వేడుకలో వ్యక్తిగత ఆనందం సామూహిక సంతోషంగా మారుతుంది. ఒకే వలయంలో నిలబడి ఆడటం, ఒకే గొంతుతో పాడటం, ఒకరికొకరు పూలను అందించుకోవడం.. ఇవన్నీ సామాజిక అనుబంధాలను బలపరిచే ఆచరణలు. కులం, ఆర్థిక స్థితి, సామాజిక హోదా వంటి భేదాలను పక్కనపెట్టి ప్రజలు కలిసే సందర్భాలు సమాజంలో పరస్పర గౌరవాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. బతుకమ్మ మహిళలకు తమ భావాలను వ్యక్తం చేసుకునే, తమ సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటుకునే వేదికగానూ నిలుస్తోంది. ఇంటి పనులు, కుటుంబ బాధ్యతల మధ్య గడిపే మహిళలు సమూహంగా చేరి పాడటం, ఆడటం ద్వారా ఆనందాన్ని పంచుకుంటారు. వారి సృజనాత్మకతకు, నాయకత్వానికి, సామూహిక చైతన్యానికి ఈ పండుగ అవకాశం కల్పిస్తుంది.

ప్రకృతి ఆరాధనగా బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉన్నప్పటికీ, పండుగలోని పర్యావరణ సందేశాన్ని ఆచరణలోనూ నిలబెట్టుకోవాలి. స్థానికంగా లభించే సహజ పూలకు ప్రాధాన్యమివ్వడం, ప్లాస్టిక్ అలంకరణలు, కృత్రిమ పదార్థాలను నివారించడం, నిమజ్జనం తర్వాత జలాశయాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత. చెరువులు, కుంటలు తెలంగాణ గ్రామీణ జీవనానికి ఆధారం. వాటి పరిరక్షణకు బతుకమ్మ స్ఫూర్తి దోహదపడాలి. పండుగ వైభవం పెరుగుతున్న కొద్దీ దాని అసలు సారాన్ని మరచిపోకూడదు. ఆర్భాటం కన్నా ఆత్మీయత, పోటీ కన్నా భాగస్వామ్యం, అలంకరణ కన్నా ప్రకృతిపై ప్రేమ ముఖ్యమనే భావన బతుకమ్మ ద్వారా బలపడాలి. జానపద పాటలు కనుమరుగుకాకుండా వాటిని సేకరించడం, నమోదు చేయడం, యువతకు నేర్పించడం ద్వారా ఈ అమూల్యమైన సాహిత్య సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి. బతుకమ్మ తెలంగాణ పండుగ మాత్రమే కాదు.. ప్రకృతిని గౌరవించే భారతీయ జీవన దృక్పథానికి, స్త్రీశక్తిని ఆరాధించే సంప్రదాయానికి, సామూహిక జీవన విలువలకు ప్రతీక. పూలలో సౌందర్యాన్ని, పాటల్లో చరిత్రను, ఆటల్లో ఐక్యతను, ఆచారాల్లో ప్రకృతి ప్రేమను నింపుకున్న ఈ పండుగ మన సాంస్కృతిక అస్తిత్వాన్ని గుర్తుచేస్తుంది. పూలను పేర్చి బతుకమ్మను నిలబెట్టడం ఒక సంప్రదాయం.. మనుషుల మధ్య ప్రేమను పేర్చి సమాజాన్ని నిలబెట్టడం దాని అసలైన సందేశం. ఈ భావన ప్రతి ఇంటా, ప్రతి పల్లెలో, ప్రతి తరంలో సజీవంగా ఉన్నప్పుడే బతుకమ్మ వేడుకలకు పరిపూర్ణత చేకూరుతుంది. తెలంగాణ ఆడపడుచుల గొంతుల్లో బతుకమ్మ పాటలు మార్మోగినంత కాలం.. ఈ నేల సంస్కృతి, ప్రకృతి ప్రేమ, సామూహిక చైతన్యం తరతరాలకు కొనసాగుతూనే ఉంటాయి.

- రామకిష్టయ్య సంగనభట్ల, సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నంబర్: 9440595494

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ఈవార్తలు పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.